ఆంధ్రజ్యోతి 3 ప్రకాశం జిల్లా వార్తలు
బుధవారం 16, జూలై 2025



వెలిగొండ ప్యాకేజీ-2 పెండింగ్ పనులకు మోక్షం

- సవరించిన అంచనా రూ.583.27 కోట్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు
- సుంకేసుల డ్యామ్, ఫీడర్ కాలువ, తీగలేరు పనులు ఇక చకచకా
- ప్యాకేజీ-4లోనూ రూ.160 కోట్ల అదనపు నిధులు మంజూరు

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన పనులకు మోక్షం లభించింది. అందుకు వీలుగా ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాజెక్టు ప్యాకేజీ-2లో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన పనులను వేగవంతం చేసే విధంగా నిర్మాణ విలువను రూ.583.27 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు గత రాత్రి వెలువడ్డాయి.

ఒంగోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును మొత్తం ఏడు ప్యాకేజీలుగా విభజించారు. అందులో ప్యాకేజీ-2లో సుంకేసుల డ్యామ్ నిర్మాణం, ఫీడర్ కాలువ, 62వేల ఎకరాలకు నీరందించే తీగలేరు కాలువల తవ్వకం, వాటిపై వివిధ రకాల నిర్మాణాలు ఉన్నాయి. ప్రాజెక్టు తొలిదశలో లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా ప్యాకేజీ-2 పనుల కోసం అధికారులు 2004 సెప్టెంబరులో రూ.210.29 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి ప్రభుత్వం ఈపీసీ విధానంలో టెండర్లు పిలిచింది. అందులో భాగంగా జయప్రకాష్, గాయత్రి కంపెనీలు జాయింట్ వెంచర్‌తో రూ.254 కోట్లకు ఆ పనులు పొందాయి. పనులు జరిగే క్రమంలో ప్రాజెక్టు రెండవ దశ కింద ఈ 2007 నవంబరులో రూ.78.81 కోట్లు, 2009 జనవరిలో మరో రూ.13.76 కోట్లు మంజూరయ్యాయి. అలా పాలనా అనుమతులు రూ.347 కోట్లకు చేరాయి.

వైసీపీ ప్రభుత్వంలో గాలికొదిలేశారు

సుంకేసుల డ్యామ్ నిర్మాణం పూర్తితో పాటు మరికొన్ని పనులు జరగ్గా ఇంకొన్ని పనులు చేయాల్సి ఉంది. అలా చేసిన పనుల్లో అధిక భాగం గత టీడీపీ ప్రభుత్వంలో అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చేనాటికి ఈ ప్యాకేజీలో అప్పటి వరకు పాలనా అనుమతులు ఉన్నదానికంటే ఎక్కువగానే పనులు జరిగాయి. దానికి తోడు వ్యాట్‌ట్యాక్స్, ఇతర మారిన ప్రభుత్వ నిబంధనలు, పెరిగిన ధరలకు అనుగుణంగా టెండరు ధరల పెంపు, మిషనరీ ఖర్చులు పెంపు, ఇతరత్రా కారణాలతో ప్యాకేజీ పనుల అంచనాను పెంచాలని కోరుతూ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించే ఒంగోలులోని సీఈ కార్యాలయం నుంచి గత వైసీపీ ప్రభుత్వ కాలంలో పలుమార్లు లేఖలు రాశారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం 2019 ఆగస్టు నుంచి 2022 ఆగస్టు వరకు ఐదారుసార్లు అలా లేఖలు రాసిన అధికారులు గత ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేకపోవడంతో చేసేది ఏమిలేక మిన్నకుండిపోవడంతో పనులు కూడా నిలిచిపోయాయి.

ప్రజాప్రభుత్వంలో వెలిగొండపై దృష్టి

ప్రజా ప్రభుత్వం వచ్చాక వెలిగొండపై దృష్టిపెట్టింది. గత ఏడాది అక్టోబరు 29న మంత్రి నిమ్మల రామానాయుడు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాజెక్టును సందర్శించి పనులు పరిశీలించారు. అధికారులతో సమీక్ష చేశారు. ఆ సమయంలో ఇలాంటి అంశాలను గుర్తించి తగు ప్రతిపాదనలకు అధికారులను ఆదేశించారు. ఆ క్రమంలో రూ.558.66 కోట్లతో సవరించిన అంచనాలతో ప్రభుత్వానికి ఈ ఏడాది జనవరి 28న ఇక్కడి ప్రాజెక్టు సీఈ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు ప్రస్తుత ఏడాది వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకొని రూ.583.27 కోట్లతో సవరించిన అంచనాలకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వెలిగొండ ప్యాకేజీ-2 పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఏర్పడింది.

చేపట్టనున్న పనులు ఇవే..

ప్రస్తుతం ప్యాకేజీ-2లో చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల బిల్లుల చెల్లింపుతో పాటు సుంకేసుల డ్యామ్ వద్ద లిఫ్ట్, విద్యుత్ సౌకర్యం వంటి పెండింగ్ పనులతో పాటు ఫీడర్ కాలువ, తీగలేరు కాలువల్లో అక్కడక్కడా అసంపూర్తిగా ఉన్న కాలువల తవ్వకం పనులు, ఫీడర్ కాలువల్లో కీలకమైన నాలుగు సిమెంట్ నిర్మాణాలు, తీగలేరు కాలువలో మరో 30 నిర్మాణాలు చేపట్టనున్నారు. ప్యాకేజీ-4లో కూడా పెండింగ్ పనులకు గత వైసీపీ ప్రభుత్వం అదనపు నిధులు ఇవ్వక కొన్ని నిలిచిపోగా ఈ ఏడాది మార్చిలో ఆ ప్యాకేజీకి అదనంగా సుమారు రూ.160 కోట్లను ప్రజా ప్రభుత్వం మంజూరు చేసింది.



గాడినపడిన ప్రభుత్వ వైద్యం

- వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన వైద్యశాలలు ప్రస్తుతం మెరుగు
- పీహెచ్‌సీల్లో 172 రకాల మందులు
- 64 రకాల వైద్య పరీక్షలతో పాటు ఆహ్లాదకర వాతావరణంలో సేవలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ప్రభుత్వ వైద్యసేవలు ప్రస్తుతం మెరుగుపడ్డాయి. గతంలో వైద్యసేవలపై ఆర్భాటపు ప్రచారాలతో ఆ వ్యవస్థను పూర్తిగా గాడితప్పించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక వచ్చిన ఏడాది కాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెరుగుపర్చడమే కాకుండా రోగులకు అవసరమైన వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులను అందించేందుకు చర్యలు చేపట్టింది.

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలల్లో రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో వైద్యసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల వైద్యాధికారులు, నర్సులు, వివిధ విభాగాల్లోని ఉద్యోగుల బదిలీలతో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగడంతో పాటు వైద్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అనేకరకాల మందులను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 64 రకాల వైద్య పరీక్షలతో పాటు అందుకు అనుగుణంగా 172 రకాల మందులను అందుబాటులో ఉంచింది. బాధితుడి వ్యాధులకు అనుగుణంగా సాధారణ మందులతోపాటు అందుకు అవసరమైన యాంటీబయాటిక్ మందులను కూడా ఇస్తున్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి తదనుగుణంగా వెంటనే మందులను అందించేందుకు సిబ్బందిని నియమించారు. అందుకు అవసరమైన మందులను కూడా ఆయా వైద్యశాలలకు సకాలంలో అందించే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు చర్యలు చేపట్టారు.

అందుబాటులో వైద్యులు, సిబ్బంది

వైద్యశాలకు వచ్చిన రోగికి ఆ ఆస్పత్రిలో ఉండే వాతావరణంతోనే వ్యాధి తగ్గే విధంగా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వైద్యశాలలో మిగతా 6లో...


భిక్షాటన చేస్తున్న సహకార ఉద్యోగులు

సహకార ఉద్యోగుల ఆకలి కేకలు

- భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా సహకారశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట తమ ఆకలి బాధలను పట్టించుకోవాలంటూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చేతిలో ప్లేట్లు పెట్టుకొని భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో రోడ్డున పడాల్సిన మిగతా 6లో...

ముప్పా సురేష్ ఎక్కడ?

- హైకోర్టులో బెయిల్ తిరస్కరణ
- రెండు నెలలకుపైగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ప్రధాన నిందితుడు


ఒంగోలు క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం కలిగించిన ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న ముప్పా సురేష్ రెండు నెలలకుపైబడి పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నాడు. మరోపక్క సురేష్ తరుపున దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ను మంగళవారం హైకోర్టు తిరస్కరించింది. అయినప్పటికీ సురేష్ ఆచూకీ మాత్రం దొరకలేదని పోలీసులు చెబుతున్నారు. వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు దశలో ఉందని, సురేష్‌కు హత్య కేసుతో సంబంధం ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. సురేష్ కంపెనీలో పనిచేసే డైరెక్టర్ ఖాతా నుంచి కేసులో ప్రధాన నిందింతుడిగా ఉన్న వినోద్‌కు నగదు బదిలీ జరిగినట్లు కోర్టు ముందు పోలీసులు ఆధారాలు మిగతా 6లో...


'మీకోసం'లో 11.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మీకోసంలో ఆత్మల సంతకాలు

- మారని ఉద్యోగుల తీరు
- నోటీసులిచ్చినా స్పందించని అధికారులు

పెద్దారవీడు మండలంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వ శాఖల అధికారుల ఆత్మలు హాజరయ్యాయి. ఇది చదవడానికి విచిత్రంగా ఉన్నా అధికారుల తీరు చూస్తే నిజమేననిపిస్తోంది. మనుషులు లేకుండానే అటెండెన్స్‌లో సంతకాలు వచ్చేస్తున్నాయి. గత వారం జరిగిన మీకోసంకు గైర్హాజరైన అధికారులకు తహసీల్దార్ నోటీసులిచ్చినా స్పందన లేదు.


రిజిష్టర్‌లో 8 మంది సంతకాలు

పెద్దారవీడు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు సరిగ్గా పనిచేయడం లేదు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పక్కనున్న ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రతి శాఖకూ చెందిన ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకూ ఎంపీడీవో మిగతా 6లో...

భూదందాలు.. నకిలీ పత్రాలు

- వెలుగుచూస్తున్న అక్రమాలు
- గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల విలువైన ఆస్తులు కొల్లగొట్టిన వైనం
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఫోర్జరీగా నిర్ధారణ
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో కొందరు భూఅక్రమార్కులు రెచ్చిపోయారు. కోట్ల రూపాయలు విలువైన ఆస్తులు కొల్లగొట్టేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. అధికారం అండ చూసుకొని ఫోర్జరీ సంతకాలు చేశారు. అవన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. విలువైన భూములను కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై కోర్టు ఆదేశాల మేరకు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారు. అప్పట్లో పోలీసు స్టేషన్లలో స్వయంగా వైసీపీ నేతల అనుయాయులు, వారసులు పంచాయితీలు పెట్టేవారని స్వయంగా బాధితులు ఆరోపించారు కూడా. పోలీసుల అండతో నిజమైన భూ యజమానులను బెదిరించి సొమ్ము చేసుకున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

ఒంగోలు క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొప్పోలు రోడ్డులోని జాతీయ రహదారి పక్కన ఉన్న కొప్పోలు సర్వే నంబరు 613/1ఈలో గల 3 ఎకరాల 18సెంట్ల భూమి వివాదం ఉంది. దుబాయ్‌లో ఉంటున్న నగరానికి చెందిన వ్యక్తి ఆ భూమిని గతంలో కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి ఒంగోలులో నివాసం ఉంటున్న ఆయన సోదరునికి జీపీఏ ఇచ్చారు. దాని విలువ సుమారు ఎకరా రూ.3కోట్లు కావడంతో దానిపై వైసీపీ నేతలు, కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఆ భూమిలో తమకు సగభాగం ఉందంటూ నకిలీపత్రాలు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలతో ఒంగోలుకు చెందిన ఐదుగురు అన్నదమ్ముల ఉమ్మడి కుటుంబం అడ్డుపడింది. తమకు సగం భాగం ఇచ్చి మిగిలిన భూమిని విక్రయించుకోవాలని అప్పటి నాయకుల అండదండలతో పోలీసు స్టేషన్‌లో మిగతా 6లో...


చర్చిలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు

చర్చిలోనే బడి

- లింగారెడ్డి కాలనీలో ఐదేళ్లుగా బోధన
- పట్టించుకోని అధికారులు

తర్లుపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల గుడి లాంటిది. అయితే మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీలో గత ఐదేళ్ల నుంచి చర్చిలోనే బడిని కొనసాగిస్తున్నారు. లింగారెడ్డి కాలనీకి 2017లో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలను మంజూరు చేసింది. రెండేళ్ల పాటు ఒక అద్దె గదిలో పాఠశాలను నిర్వహించి తర్వాత చర్చిలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. లింగారెడ్డి కాలనీలో చర్చిలోనే గత ఐదేళ్ల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు 23 మంది పిల్లలు ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. చర్చిలో కాలనీ వాసులు ప్రార్థనలు చేసుకునే సమయంలో విద్యార్థుల బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చేసేది ఏమి లేక విద్యార్థులు చెట్ల కిందే చదువు సాగిస్తున్నారు. గత వైసీపీ పాలనలో మిగతా 6లో...

ట్రిపుల్ ఐటీ భూములను పరిశీలించిన ఉగ్ర 7 **పాలిటెక్నిక్ అడ్మిషన్లకు ఫైనల్ ఫేజ్ నోటిఫికేషన్** 17 నుంచి ప్రారంభం... 23న సీట్ల కేటాయింపు

నలుగురు డిప్యూటీ ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు డిప్యూటీ ఎంపీడీవోగా పోస్టింగ్‌లు ఇస్తూ డీపీవో వెంకటనాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు సీనియర్లు అసిస్టెంట్లు, ఒకరు గ్రేడ్-1 పంచాయతీ అధికారి డిప్యూటీఎంపీడీవోగా ఉద్యోగోన్నతులు పొందారు. కె.వేణుగోపాలరెడ్డి (పీసీపల్లి), కె.జయప్రకాష్‌బాబు (హనుమంతునిపాడు), ఎం.మురళీ(త్రిపురాంతకం), బి.రమేష్‌బాబు(గిద్దలూరు)లను డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు.

ఇరువురికి సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి

ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న పీఎస్ఎస్.కోటేశ్వరరావు, కె.ప్రభాకరవర్మలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు మంగళవారం వారు ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు.

టెన్త్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థీ పేర్లు నమోదు చేసుకోవాలి

● జిల్లా ఉపాధి కల్పనాధికారి రమాదేవి

ఒంగోలు(రూరల్), జూలై15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఆపై చదువులు పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఒంగోలులోని ఉపాధి కల్పన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రమాదేవి కోరారు. ఒంగోలులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఉపాధి కల్పన కార్యాలయంలో పేర్లు నమోదు అయిన వారికి ఉద్యోగావకాశాలను తెలియజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, కళాశాల ప్రిన్స్‌పాల్ ప్రసాద్‌బాబు, డైరెక్టర్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ శివకృష్ణ పాల్గొన్నారు.

నాగభైరవ పురస్కార గ్రహీతలు వీరే..

ఒంగోలు కల్చరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జాతీయ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు పేరిట నాగభైరవ సాహిత్యపీఠం ప్రతి సంవత్సరం అందిస్తున్న సాహిత్య పురస్కార గ్రహీతల పేర్లను సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మంగళవారం వెల్లడించారు. అనువాద సాహిత్యంపై పుస్తకాలను ఆహ్వానించగా వచ్చిన వాటినుంచి రెండు పుస్తకాలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి రచించిన నెత్తురునది పుస్తకానికి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, కోనేరు కల్పన రచించిన దర్పణం కథాసంపుటికి ద్వితీయ బహుమతిగా రూ.5వేలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆగస్టు 17వ తేదీ జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుతులు అందజేసి ఘనంగా సత్కరిస్తామన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కలిగించడం అనేది న్యాయవిద్య అభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల విద్యార్థులతో లీగల్ లిటరసీ క్లబ్‌ను ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వం అనే కార్యక్రమం ద్వారా కక్షిదారుల మధ్య వ్యాజ్యాలను పరిష్కరించే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. న్యాయకళాశాల కరస్పాండెంట్ సీహెచ్.రామకృష్ణారావు మాట్లాడుతూ లీగల్ లిటరసీ క్లబ్ తమ కళాశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తమ విద్యార్థుల ద్వారా వీలైనంత వరకు సామాన్య ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నటరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు సీసీకెమెరా సర్వీసింగ్, రిపేర్‌పై ఉచిత శిక్షణను ఈనెల 24వ తేదీ నుంచి ఆగస్టు 5వతేదీ వరకు ఇవ్వనున్నట్లు ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు యువకులు తమ వివరాలతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు ఉంటాయని, వివరాలకు 9573363141 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యసనాలకు లోనై.. యూట్యూబ్ చూసి..

వరసగా బుల్లెట్ వాహనాల అపహరణ
ఏడుగురు బీటెక్ విద్యార్థుల ముఠా అరెస్టు
యూట్యూబ్‌లో చూసి లాక్ తీయడంలో శిక్షణ
16 బుల్లెట్ బైక్‌లు, ఒక స్కూటీ రికవరీ
వివరాలను వెల్లడించిన చీరాల డీఎస్పీ మొయిన్


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు, బుల్లెట్ వాహనాలు

అద్దంకి, జూలై 15(ఆంధ్రజ్యోతి): వారంతా ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు. ఒంగోలులోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. చెడు వ్యసనాలకు లోనైన వీరు చోరీల బాట పట్టారు. ఏకంగా 16 బుల్లెట్ వాహనాలను చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి చీరాల డీఎస్పీ మొయిన్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంగోలు పట్టణంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అద్దంకికి చెందిన ఓ విద్యార్థి, పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఇంకొకరు, నెల్లూరు జిల్లా కావలి మండలం చౌదరి పాలెంకు చెందిన మరొకరు, ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం యడ్లూరిపాడుకు చెందిన ఒకరు, దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి చెందిన ఒకరు, ఎన్టీఆర్ కృష్ణజిల్లా , కంచికిచర్ల మండలం, కొత్త పెండ్యాలకు చెందిన ఇంకొకరు, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఆలూరుకు చెందిన మరకొరు ఒంగోలులోని వీఐపీరోడ్డులోని హిందూ శ్మశాన వాటిక సమీపంలో ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో వీరు చెడు వ్యసనాలకు లోనయ్యారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో యూట్యూబ్‌లో బుల్లెట్ వాహనం హ్యాండిల్ లాక్ ఎలా తీయాలి, ఎలా స్టార్ట్ చేయాలనే విషయాన్ని ఒకడు తోటి స్నేహితులకు వివరించాడు. తొలుత కొటప్పకొండ తిరునాళ్లలో బుల్లెట్ వాహనాన్ని దొంగిలించారు. అనంతరం సింగరకొండ తిరునాళ్లలో పార్కింగ్ చేసిన మరో బుల్లెట్ వాహనాన్ని దొంగిలించారు. ఆ తరువాత అద్దంకి పట్టణంలోని చిన్న గానుగపాలెం, కాకానిపాలెం, దామావారిపాలెం, ఆర్టీసీ బస్టాండ్, పాత ఆంధ్ర బ్యాంక్, సింగరకొండ గుడివద్ద వాహనాలను దొంగిలించారు. అదేక్రమంలో జె.పంగులూరు పోలిస్‌స్టేషన్ పరిధిలో ఒక బుల్లెట్, ఒక స్కూటీ, చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు బుల్లెట్ వాహనాలు, నరసరరావు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, మద్దిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి చొప్పున వాహనాలను దొంగిలించారు. వీటిలో కొన్నింటిని వినియోగించుకుంటూ, మిగిలినవి అద్దంకి పట్టణంలోని బ్రహ్మానందం కాలనీలోని పాడుబడిన భవనంలో దాచిపెట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీ తూషార్ డూడీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా అద్దంకి టౌన్ సీఐ సుబ్బారాజు ఆధ్వర్యంలో దొంగల ముఠాను అదుపులోకి తీసుకుని రూ.25.20 లక్షల విలువైన 16 బుల్లెట్‌లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మోటర్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడిన ముఠాను అరెస్టు చేసిన చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి పట్టణ సీఐ సుబ్బారావు, ఏఎస్ఐ వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, సిబ్బంది వి.బ్రహ్మయ్య, పి.బ్రహ్మయ్య, వెంకటగోపయ్యలను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ వాహనాలు

పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలి

● ప్రభుత్వ సలహాదారుడు అంకారావు


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు అంకారావు

ఒంగోలు(రూరల్), జూలై15(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం పూర్తిస్థాయిలో వృక్షసంపదను అభివృద్ధి చేయాలని అటవీకరణ ప్రభుత్వ సలహాదారుడు కొమెర అంకారావు కోరారు. ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో మంగళవారం అటవీకరణ-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై పలు శాఖల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అంకారావు మాట్లాడుతూ అడవుల పరిరక్షణతోనే మానవ, జీవరాసుల మనుగడ ఆధారపడి ఉంటుందని చెప్పారు. అటవీ సంపద ఎక్కడైతే ఉత్తమంగా ఉంటుందో అక్కడ మంచి వాతావరణం ఉంటుందన్నారు. ప్రకృతిని నాశనం చేస్తే అది మనలను కూడా నాశనం చేస్తుందని పేర్కొన్నారు. నలమల అడవుల్లో వృక్షాలు లేని చోట 5 లక్షల మొక్కలను తాను నాటినట్లు గుర్తు చేశారు. అడవులలో తిరుగుతూ ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను సేకరించి పర్యావరణాన్ని కాపాడినట్లు తెలిపారు. అలాగే స్కూళ్లకు వెళ్లి అడవులు, పక్షులు, జంతువులు, చెట్ల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులను బోధించినట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో 12 రకాల మొక్కలు నాటాలన్నారు. చింత, మామిడి, సపోటా, జామ, మంచినీడను ఇచ్చే వేప, రాగి, మర్రి మొక్కలు నాటాలని కోరారు. ప్రతి ఇంటి దగ్గర కూడా ఔషధ గుణాల గల మొక్కలు నాటుకోవాలని సూచించారు. ప్రతిగ్రామం పచ్చదనంగా ఉండేలా డ్వామా ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమించే కొమెర అంకారావును ప్రతి ఉద్యోగి ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గాడినపడిన ప్రభుత్వ వైద్యం

(5వపేజీ తరువాయి)

ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీల్లో పారిశుధ్య పనులను మెరుగుపర్చడంతోపాటు వైద్యశాలలో వచ్చే వేస్టేజ్‌ను కూడా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఇంకొకవైపు వైద్యశాలకు వచ్చిన రోగికి అవసరమైన టెస్టులు (పరీక్షలు) నిర్వహించి అవసరమైతే మరోకచోటకు పంపించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించడంతో వైద్యాధికారులకు బాధ్యతలను కూడా పెంచారు. సకాలంలో సిబ్బంది వైద్యశాలలకు వచ్చేందుకు ముఖహాజరును కూడా రాష్ట్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకున్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం అంచనా వేసి తదనుగుణ చర్యలు చేపట్టింది.

మందులపై పూర్తి అవగాహన

ఇంకొకవైపు ప్రాథమిక వైద్యశాలలను కూడా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. పూర్తిగా ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు రాష్ట్రస్థాయి వైద్యాధికారుల సూచనలకు అనుగుణంగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అందించే మందులపై అనేకమందికి అపోహలు నెలకొనడంతో దానిని తొలగించే ప్రక్రియను కూడా చేపట్టారు. ప్రభుత్వం అందించే మందులపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంకొకవైపు సంచార వైద్యసేవల వాహనాల ద్వారా కూడా అత్యవసర సమయంలో వినియోగించేందుకు చర్యలు తీసుకున్నారు. అందుకోసం 105 రకాల మందులను అందుబాటులోకి తీసుకొని వచ్చారు.

వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు

పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శ్రీకారం చుట్టాం. ప్రభుత్వ సహకారంతో వైద్యశాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో వైద్యసేవలు అందించడం ద్వారా ప్రజల్లో నమ్మకం ఏర్పడింది. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా కొరత ఉందంటే వెంటనే ఆయా మందులను పంపే విధంగా చర్యలు తీసుకున్నాం. మందుల వినియోగంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకొకవైపు వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించే విధంగా కూడా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మంచి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

\- డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

భూ దందాలు.. నకిలీపత్రాలు

(5వపేజీ తరువాయి)

పంచాయితీ పెట్టారు. అందుకు భూయజమాని సొదరుడు అంగీకరించలేదు. దీంతో అతనిని భయపెట్టారు. అయినప్పటికీ భూమి దుబాయ్‌లో ఉన్న తన సొదరునిదని చెప్పి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం సిట్ ఏర్పాటు చేసిన తరువాత తన భూమిపై పోర్జరీ సంతకాలతో కబ్జా చేయాలని షేక్ గౌస్ బాషా కుటుంబసభ్యులు ప్రయత్నం చేశారని ఒంగోలు తాలూకా పోలీసులకు నజీర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. కేసు విచారణ చేసిన పోలీసులకు గౌష్‌బాషా కుటుంబ సభ్యులు పోర్జరీ సంతకాలు చేసి నకిలీపత్రాలు సృష్టించారని ఫోరెన్సిక్ ల్యాబ్ ద్వారా వచ్చిన నివేదికలతో నిర్ధారణ అయింది. ఈ మేరకు పోలీసులు గౌస్‌బాషా కుటుంబ సభ్యులు నకిలీ పత్రాలు సృష్టించారని వారిపై కేసు నమోదు చేశారు.

● కనిగిరి ప్రాంతంలోని శంఖవరం పరిధిలోని సర్వేనంబరు 301, 302లో గల 95 సెంట్లు భూమిని (సుమారు రూ.15కోట్లు విలువ) కాజేయాలని ప్రయత్నం చేశారు. అందుకు సంబంధించి గోన బర్నబాస్, అన్నపురెడ్డి కొండారెడ్డి తదితరులు కలిసి నకిలీపత్రాలు సృష్టించారు. ఆ భూమిని అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆ భూమి యజమాని పోలంరెడ్డి మాలకొండారెడ్డి కనిగిరి పోలీసుస్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి గోన బర్నబాస్ తదితరులు నకిలీపత్రాలు సృష్టించినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో అతనితో పాటుగా ఏడుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో చేసిన భూఆక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ పత్రాలు తయారుచేసి పోర్జరీ సంతకాలు చేసి భూములు కొల్లగొట్టిన వారు జైలు ఊచలు లెక్కబెడుతున్నారు.

నకిలీ పత్రాలు తయారీ ముఠాల్లో గుబులు

గత ప్రభుత్వం హయాంలో నకిలీ పత్రాలు సృష్టించి, పోర్జరీ సంతకాలు చేసి భూములు కాజేసి కోట్లు కొల్లగొట్టిన ముఠాలలో గుబులు మొదలైంది. ఇప్పటికీ అనేక కేసుల్లో పోర్జరీ సంతకాలు నిర్ధారణ కావడంతో వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కబ్జారాయుళ్లు కొందరు రాజీబాట పడుతున్నట్లు సమాచారం. నకిలీపత్రాల తయారీ ముఠాలు మాత్రం రోజులు లెక్కబెడుతున్నారు.

'మీ కోసం'లో ఆత్మల సంతకాలు

(5వపేజీ తరువాయి)

కార్యాలయమే దిక్కు అయింది.

ఏ ఒక్కరూ రాలేదు

తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయకపోవడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పరికరాలతో వీడియో మానిటర్‌ను ప్రారంభించారు. కానీ ఏ ఒక్క శాఖ అధికారి కూడా హాజరుకాలేదు. కనీసం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న మీ కోసం కార్యక్రమానికి కార్యాలయంలో ఉన్న ఎంపీడీవో కూడా హాజరుకావడం లేదు. తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ తన కార్యాలయంలోనే కూర్చొని అర్జీలను స్వీకరించారు.

అధికారుల ఆత్మల సంతకాలు

ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న మీకోసం వీడియో కాన్ఫరెన్స్‌కు ఒక్క అధికారి కూడా హాజరుకాలేదు. కానీ తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న మీకోసం అటెండెన్స్ రిజిస్టర్‌లో 8 మంది అధికారుల సంతకాలు ఉన్నాయి. అంటే ఆత్మలు సంతకాలు చేశాయా అన్న అనుమానం రాక తప్పదు.

తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ కార్యాలయంలో కూర్చొని అర్జీలు స్వీకరించగా, సీహెచ్ శిరీష (ఎంపీడీవో కార్యాలయం), సీహెచ్ కనకదుర్గ (ఎంపీహెచ్ఎంఎస్), ఎన్.అంజమ్మ(ఐసీడీఎస్), ఆర్.కృపమ్మ(డీఆర్‌డీఏ), సునీల్ నాయక్(ఏఈవో), బి.అంజలీబాయ్(డీఈవో,హౌసింగ్) వీడియో కానరాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు ప్రత్యక్షమయ్యాయి. మిగిలిన ప్రధాన శాఖలైన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, విద్యుత్ వంటి శాఖల అధికారులు మీ కోసం కార్యక్రమం ఒకటి జరుగుతుందన్న విషయం పూర్తిగా మరిచిపోయినట్లు ఉన్నారు.

నోటీసులిచ్చినా స్పందించని అధికారులు

గత వారం మీకోసం కార్యక్రమానికి గైర్హాజరైన, ఆలస్యంగా వచ్చినవారు, వచ్చి మధ్యలోనే వెళ్లిపోయిన అధికారులకు తహసీల్దార్ శైలేంద్రకుమార్ నోటీసులు జారీ చేశారు. అయినా ఒక్క అధికారి నుంచి కూడా స్పందన లేదు.

నిమ్మ తోటలో అగ్ని ప్రమాదం

అవీఇవీ

కాలి బూడిదైన చెట్లు, డ్రిప్ పరికరాలు
లక్షల్లో నష్టం అంటున్న రైతు సుబ్బారావు


తోటలో కాలిపోయిన డ్రిప్ పరికరాలు, బూడిదైన నిమ్మచెట్లు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఆకతాయి పనులకు నిమ్మ తోటలోని చెట్లు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. జరిగిన నష్టాన్ని మంగళవారం బాధిత రైతు సుబ్బారావు విలేకరులకు తెలిపారు. మండలంలోని మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన చేకూరి సుబ్బారావు 3 ఎకరాల్లో నిమ్మ తోటను సాగు చేశారు. కాపు దశలో ఉన్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగిరెట్ వేయడంతో ఆ నిప్పు రవ్వలు మంటలు ఎగిసి పొలం అంతా వ్యాపించాయి. దీంతో డ్రిప్ పరికరాలు, చెట్లు మాడి మసయ్యాయి. ఉద్యానవన శాఖ, పోలీస్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు రైతు తెలిపారు. డ్రిప్ పరికరాలు, మొక్కలు బూడిద కావడంతో లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతు సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ 15వ బ్లాకులో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా సాగర్ జలాల సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు చెప్పారు. నీటిని విడుదల చేయాల్సిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు సమ్మెలో ఉన్నామని, నీటి సరఫరా జరగదని తెలపడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు.

సాహిత్య వేదిక జాతీయ అధ్యక్షురాలిగా ప్రశాంతిజాయ్


నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రశాంతిజాయ్

ఒంగోలు నగరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కళ, సాహిత్యం, సాంస్కృతిక వికాసానికి పాటుపడుతున్న ప్రముఖ సంస్థ తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ ప్రశాంతిజాయ్‌ను నియమించారు. కొత్తపట్నంకు చెందిన డాక్టర్ ప్రశాంతిజాయ్ చాలా కాలంగా కవిత్వం, కళలు, కౌన్సిలింగ్, మోటివేషన్, నాయకత్వం, ఫైనాన్షియల్ అంశాలలో సేవలను అందిస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా ఇటీవలే ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో గౌరవించారు. తెలుగువెలుగు వ్యవస్థాపకులు పోలోజ్‌రాజ్ ఆ మెను జాతీయ మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రశాంతిజాయ్‌ను ఘనంగా సన్మానించారు. జాతీయ అధ్యక్షురాలిగా నియమితులైన ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

సహకార ఉద్యోగుల ఆకలి కేకలు

(5వపేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేవారు. ఈ విషయాన్ని అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా నేడు, రేపు అంటూ కాలం గడుపుతున్నారే తప్ప తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల నుంచి జీతాలు లేక అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషించుకోవాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం కావడంతో పిల్లలకు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పెడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సహకారశాఖ ఉద్యోగులకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి కార్యాలయ ఉద్యోగులు, విభాగేయ సహకార అధికారి కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముప్ప సురేష్ ఎక్కడ?

(5వపేజీ తరువాయి)

సమర్పించారు. ఈ పరిస్థితిలో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు అవరోధంగా మారుతుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో సురేష్‌కు ముందస్తు బెయిల్‌ను తిరస్కరిస్తూ హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో సురేష్ ఎక్కడ ఉన్నాడనేది సాంకేతిక పద్ధతుల ద్వారా పరిశీలిస్తున్నామని కేసు విచారణాధికారి ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

చర్చిలోనే బడి

(5వపేజీ తరువాయి)

పాఠశాల సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. అప్పుడు ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి కూడా పాఠశాలకు వచ్చి వెంటనే పాఠశాల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ పాఠశాల నిర్వాహణ చర్చిలోనే సాగుతోంది. అప్పటి వైసీపీ నాడు-నేడు పేరుతో అనేక స్కూళ్లల్లో మౌలిక వసతులు కల్పించినప్పటికీ లింగారెడ్డికాలనీలో పాఠశాల ఏర్పాటును విస్మరించింది. దీంతో పలువురు అధికారులు, ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వమైనా లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలకు భవనం నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారులకు అనేక సార్లు ప్రతిపాదనలు పంపించా:

లింగారెడ్డి కాలనీలో ప్రాథమిక పాఠశాలకు భవనం మంజూరు చేయాలని కలెక్టర్‌కు, విద్యా శాఖ అధికారి, తహసీల్దార్‌కు అనేకసార్లు ప్రతిపాదనలు పంపించాం. అధికారులు పట్టించుకోకపోవడంతో చర్చిలోనే పాఠశాలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మరలా రెండు రోజుల్లో జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

\- దేవరకొండ సుజాత, ఎంఈవో

యాప్ ఓపెన్ చేశారో నగదు మాయం

సోషల్ మీడియా వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ వేమన

పొదిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ వేమన మంగళవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాట్ ఏపీకే అనే యాప్ మొబైల్‌లో హల్‌చల్ చేస్తోందని, దీంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. యూజర్స్ తెలియక డౌన్‌లోడ్ చేసిన వెంటనే ఫోన్ పే నుంచి నగదును హ్యాకర్స్ డ్రా చేస్తారన్నారు. పొదిలికి చెందిన మహిళ ఈ యాప్ లింక్ ఓపెన్ చేయగానే ఆమె అకౌంట్ నుంచి రూ.లక్షను కొట్టేశారన్నారు. బాధిత మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇటీవల ప్రభుత్వం తల్లికి వందనం నగదును తల్లుల ఖాతాల్లో జమ చేసిన క్రమంలో నేరగాళ్లు ఇలాంటి యాప్‌ల ద్వారా నగదును దోచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఎస్ఐ వివరించారు. కొద్ది రోజుల్లో అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాల్లోకి జమ అవుతున్న నేపథ్యంలో డాట్ ఏపీకే పీఎం కిసాన్ యోజన పేరుతో అర్హులుగా ఉన్నరా.. లేరా.. చెక్ చేసుకోవాలని నకిలీ యాప్ ఇటీవల గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోందన్నారు. సోషల్ మీడియా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పేర్కొన్నారు. అలాంటి యాప్‌లు వచ్చినప్పుడు మరొకరికి ఫార్వర్డ్ చేయకుండా వెంటనే డిలీట్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎటువంటి యాప్‌లు, లింక్‌లు ఇవ్వరనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు.





ఎమ్మార్సీలు, సీఆర్సీలకు రూ.69.65 లక్షలు విడుదల

ఒంగోలు విద్య, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని క్లస్టర్ రిసోర్స్‌సెంటర్లు(సీఆర్సీలు), మండల విద్యావనరుల కేంద్రాలకు 2025-26 విద్యా సంవత్సరానికి రూ.69.65 లక్షలు మంజూరు చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మార్సీలు, సీఆర్సీలకు సమగ్రశిక్ష కేంద్ర ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు ఆమోదం మేరకు గ్రాంటును విడుదల చేశారు. జిల్లాలోని 150 క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు ఒక్కొక్క దానికి రూ.28,700 చొప్పున రూ.43.05 లక్షలు మంజూరయ్యాయి. ఈమొత్తంలో సీఆర్సీ నిర్వహణ ఖర్చులకు రూ.10వేలు, టీఏ చెల్లింపులకు రూ.4700, కంటింజెన్సీకి రూ.14వేలు, బోధనాభ్యసన సామగ్రి సమకూర్చుకునేందుకు రూ.4వేలు కేటాయించారు. ఈమొత్తాలను స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలకు విడుదల చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. జిల్లాలోని 30 మండల విద్యావనరుల కేంద్రాలకు ఒక్కొక్క దానికి రూ.70వేల వంతున రూ.26.60 లక్షలు విడుదల చేశారు. ఎమ్మార్సీల నిర్వహణకు రూ.20వేలు, కంటింజెన్సీ కింద రూ.20వేలు, బోధనాభ్యస సామగ్రికి రూ.15వేలు, మీటింగ్ టీఏ, చెల్లింపులకు రూ.15వేలు కేటాయించారు. విద్యుత్, టాయిలెట్ల నిర్వహణ, కంప్యూటర్ మరమ్మతులు, ఇతర ఖర్చులకు మెయింటినెన్స్ గ్రాంటును వినియోగించాలి. మండల స్థాయి మేళాలో బోధనాభ్యసన సామగ్రి, రిఫరెన్స్ పుస్తకాల కొనుగోలుకు టీఎల్ఎం నిధులు వినియోగించాలి. పాఠశాలల సందర్శనకు, విషయ నిపుణులకు, హెచ్ఎంలతో సమీక్షా సమావేశాలకు టీఏ నిధులు వినియోగించాలి. ఈ నిధులు సమగ్ర జిల్లా ప్రాజెక్టు కార్యాలయం నుంచి నేరుగా మండల విద్యాధికారి ఖాతాకు జమవుతాయి.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ఫైనాన్స్ బిల్లు అమలు కాకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పలువురు రిటైర్డు ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చినపిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు బి. అంకిరెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కే సుబ్బారావు, కోశాధికారి జి. రామకోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్‌తో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలన్నారు. ఈ బిల్లు అమలులోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, పెన్షనర్లు కూడా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ బిల్లును అమలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయడంతోపాటు ఈపీఎస్-95 కింద డిఫైండ్ పెన్షన్ పద్ధతిలోకి తీసుకురావాలన్నారు. పే కమీషన్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగ, పెన్షనర్లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ అందించాలని కోరారు. సమగ్ర ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు రైల్వే, విమాన టికెట్లలో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలు తిరిగి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కొప్పోలు రామారావు, షన్నయ్య, రామకృష్ణ, కరీముల్లాఖాన్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పెన్షనర్లు

176 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత


దర్శిలో నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

దర్శి, జూలై 15(ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలోని అన్నపూర్ణ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఆ మిల్లులో రేషన్‌బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందటంతో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, కృష్ణమోహన్, సింగరాయకొండ, గిద్దలూరు, దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కాశయ్య, రామనారాయణరెడ్డి, రాధాకృష్ణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం రాత్రి ఆ మిల్లును ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అక్కడ రేషన్ బియ్యం 176 క్వింటాళ్లు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని లెక్కకట్టి గోడౌన్‌కు తరలించారు. మిల్లు నిర్వాహకులకుపై 6ఏ కేసు నమోదు చేశారు.

కూతురు, అల్లుళ్లే శత్రువులయ్యారు

తల్లి చిన్నక్క ఆవేదన


పొలంలో నాశనం చేసిన పత్తి మొక్కలను చూపిస్తున్న చిన్నక్క

పెద్దదోర్నాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రెండునెలలుగా కష్టపడి సాగు చేసిన పత్తిని నాశనం చేశారని, తనకు న్యాయం చేయాలని మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఏర్వ చిన్నక్క మంగళవారం ప్రభుత్వాన్ని కోరింది. తొమ్మిదేళ్ల కిందట భర్తను పోగొట్టుకుని ముగ్గురు బిడ్డలను చేతబట్టి కాయకష్టంతో వారికి చదువు సంధ్యా చెప్పించి వివాహాలు జరిపిస్తే వారు తనకు శత్రువులుగా మారారని వాపోయారు. కొత్తూరు గ్రామానికి చెందిన ఏర్వ చిన్నక్క భర్త శ్రీనివాసరెడ్డి 2016లో పొలంలో పంటకు నీటి తడులు ఇస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మరణించారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. భర్త చనిపోయాక చిన్నక్క బిడ్డలను చదివించి వివాహాలు చేయించింది. ఉన్న ఆస్తిపాస్తులను ముగ్గురికీ రాసిచ్చింది. ఆస్తుల పంపకంలో భాగంగా మూడో కూతురికి దోర్నాలలో ఇచ్చిన ప్లాట్‌కు మంచి ధరలు వచ్చాయి. మిగిలిన ఇద్దరు కూతుళ్లు, అల్లుళ్లు ఆమెపై ఆగ్రహం పెంచుకున్నారు. ఈ క్రమంలో కొత్తూరు గ్రామంలో ఉన్న రెండెకరాల భూమిని తమ పేరున రిజిస్టర్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో కుదరదని చెప్పడంతో ఆమె కష్టపడి సాగుచేసిన పత్తి పైరును మొత్తం పెరికి వేశారు. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని చిన్నక్క విలపించారు. తనకు న్యాయం చేయాలని పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పంపకాల వివాదం వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. సమాచారం మేరకు పట్టణంలోని గణేష్ నగర్‌లో నివాసం ఉంటున్న యగటీల లక్ష్మీప్రశాంతి, భర్త రంగనాయకులకు సంబంధించిన ఆస్తిలో బంధువులతో తరచూ గొడవలు జరిగేవి. లక్ష్మీప్రశాంతి ఆడబిడ్డ, ఆమె భర్త, అత్త తరచూ తనను దూషించడం వలన లక్ష్మీప్రశాంతి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను భర్త రంగనాయకులు గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మీప్రశాంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భర్త రంగనాయకులు ఫిర్యాదు మేరకు అరన్‌సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒంగోలులో నాలుగు, మార్కాపురంలో రెండింటిని ఏర్పాటు చేశారు. ఉదయం సెషన్ 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగ్గా అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన గదులను చూసుకొని లోపలికి వెళ్లారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతనే లోపలికి అనుమతించారు. మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగ్గా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.


ఒంగోలులో అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

మౌలిక సదుపాయాల కల్పనే కీలకం

కలెక్టర్ అన్సారియా ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆవాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను త్వరగా కల్పించేందుకు మరింత దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం పీఎం జన్‌మన్, డీఏజేజీయూఏ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన అవసరాలలో, ప్రత్యేకించి ఐటీడీఏ పరిధిలో ఉన్న జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలకు ఈ సదుపాయాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు గిరిజనులకు సమర్థవంతంగా అందేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాలలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలన్నారు. బిల్లులను ప్రభు త్వం త్వరగా చెల్లిస్తున్నందున లబ్ధిదారులందరూ వెంటనే ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసేలా చూడాలన్నారు. గిరిజన ఆవాస గ్రామాలకు రోడ్లు, విద్యుత్‌సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, వం టగ్యాస్ కనెక్షన్లు, టెలిఫోన్ టవర్ల నిర్మా ణం, మొబైల్ మెడికల్ యూనిట్ల సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు సమావేశంలో వివిధ శాఖల అధికారులు వరలక్ష్మీ, శ్రీనివాస ప్రసాద్, బాలశంకరరావు, చంద్రమౌళీశ్వరరావు, రవితేజ, డాక్టర్ వెంకటేశ్వర్లు, సువర్ణ, శ్రీనివాసరావు, రవికుమార్, కట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ భూములను పరిశీలించిన ఉగ్ర

కనిగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బల్లిపల్లి వద్ద ట్రిపుల్‌ఐటీ కళాశాలకు కేటాయించిన భూములను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. సదరు భూముల స్థితిగతులను, రవాణా సరిస్థితి, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఏ విధంగా ఒనగూర్చుకోవాలో అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి ప్రాంత యువతీ, యువకులకు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాలు లభించాలంటే ఆధునిక ప్రమాణాలతో కూడి సాంకేతిక విద్య అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ఏర్పాటు జరిగితే సంపూర్ణంగా ఈ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, గంగవరపు నాగిరెడ్డి, బాలు ఓబులురెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. మోడల్ స్కూల్‌కు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాపై అధికారులతో చర్చించారు. స్కూల్‌కు ప్రహరీ, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలోని పులివెంకటరెడ్డి పార్కును సందర్శించారు. పార్కులో ఉన్న అపరిశుభ్రత వాతావరణాన్ని పరిశీలించి శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. పార్కులో ఉన్న వ్యాయామ పరికరాలను పరిశీలించారు.


బల్లిపల్లి వద్ద భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఇంటి స్థలాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేయాలి

● **జేసీ గోపాలకృష్ణ**


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను పెండింగ్ లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆర్డీవోలు తహసీల్దార్లతో సమావేశమై హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద ఇంటి స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనతో పాటు పీజీఆర్ఎస్‌లో రెవెన్యూఅంశాలపై వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు పంటసాగుదారు హక్కుల కార్డులు మంజూరు, నిత్యావసర సరుకుల పంపిణీ తదితర అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నిర్దేశించిన గడువులోపు రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్ వరకుమార్, అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, పద్మశ్రీ, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు సబ్సిడీపై కరెంట్ అందించాలి

● **రొయ్యల రైతుల సంఘం డిమాండ్**


మాట్లాడుతున్న సుబ్బానాయుడు

ఒంగోలు నగరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగుకు సబ్సిడీపై విద్యుత్‌ను అందించాలని జిల్లా రొయ్యల రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బానాయుడు మాట్లాడుతూ జిల్లాలో రొయ్యల చెరువులకు 1800 విద్యుత్ కనెక్షన్లు ఉండగా అందులో కేవలం 1000 మందికి సంబంధించిన కనెక్షన్లకు మాత్రమే సబ్సిడీ విద్యుత్ అందుతుందన్నారు. మిగిలిన రైతులకు సబ్సిడీ వర్తించటం లేదని చెప్పారు. మిగిలిన రైతులకు 10 ఎకరాలకు మించి, డీకేడీ భూముల్లో సాగు ఉన్నందు వల్ల సబ్సిడీ విద్యుత్ అందటం లేదన్నారు. దీంతో రైతులకు సాగు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ రొయ్యల ఫీడ్ తయారీలో అధికంగా వాడే సోయా ధరలు సగానికి పైగా తగ్గాయని, కాని మేత తయారీకి కంపెనీలు ఫీడ్ ధరలను మాత్రం తగ్గించలేదన్నారు. ఫీడ్ ధరలను తగ్గించకపోగా ఫీడ్ బ్యాగ్‌పై ముద్రించే ఎమ్మార్పీ ధరను రూ.9 తగ్గించి ముద్రించి ఇటు రైతులను అటు ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గత నెల రోజుల కాలంలో వ్యాపారులు టైగర్ రకం రొయ్యల ధరలను 40కౌంట్, 30కౌంట్‌లకు రూ.100 తగ్గించారని, ఈ కారణంగా జిల్లాలో టైగర్ రకం రొయ్యలు సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. గత ఏడాది నాసిరకం సీడ్ వల్ల దిగుబడులు రాక జిల్లాలో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వద్దకు రాయబారం కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శింగమనేని అంజిబాబు, రమణయ్య, రమేష్ రెడ్డి, వేణుగోపాల రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం..

● **ఆడుకొంటున్న చిన్నారికి కరెంట్ తీగలు తగిలి తీవ్ర గాయాలు**

● **తల్లిదండ్రుల ఆవేదన**

నాగులుప్పలపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాలపై వెళుతున్న విద్యుత్‌లైన్ తొలగించాలని గ్రామస్థులు పలుమార్లు విద్యుత్ సిబ్బందికి మొరపెట్టుకొన్నారు. అయి నా వారు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఇంటిపైన ఆడుకొంటున్న ఎనిమిదేళ్ల బాలికకు విద్యుత్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ముప్పాళ్లలో జరిగింది. బాధితురాలి తాతయ్య తెలిపిన వివరాల మేరకు.. ముపాళ్ల గ్రామానికి చెందిన మద్దిన ఆంజనేయులు మనుమరాలు చష్మిత ఆదివారం సాయంత్రం డాబాపైన ఆ డుకొంటుండగా ఇంటి పైన వెళుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లు ఆమె చేతికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా చేయి కాలి తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వెంటనే గుంటూరు తరలించాలని సూచించడంతో అక్కడికి తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. నివాస గృహాలపై వెళుతున్న విద్యుత్ లైన్లు మార్చాలని పలుమార్లు సిబ్బందికి విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బాధితురాలి తాత అంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగిందని, బాధిత కుటుంబానికి తగిన నష్ట పరిహారం అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.


కాలిపోయిన చేయి

పాలిటెక్నిక్ అడ్మిషన్లకు ఫైనల్ ఫేజ్ నోటిఫికేషన్

ఈనెల 17నుంచి ప్రారంభం, 23న సీట్ల కేటాయింపు

ఒంగోలు విద్య, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు పాలిసెట్ -25 తుదిదశ నోటిఫికేషన్ జారీ చేశారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లను ఈ తుదిదశ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. ఈనెల 17నుంచి ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజస్ట్రేషన్ చేయించుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. మొదటి విడత కౌన్సెలింగ్‌కు హాజరు కానివారు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్లు పరిశీలన పూర్తయిన వారు మళ్లీ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. 17నుంచి 19 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజస్ట్రేషన్ చేయించుకోవాలి. 18నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన, గతంలో పొరపాటుగా అప్‌లోడ్ చేసిన వారికి వచ్చిన వారు మళ్లీ అప్‌లోడ్ చేయాలి. సందేహాలు ఉంటే ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. 18నుంచి 20 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేయలి. 21న తుది వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఇచ్చారు. 23న సీట్ల కేటాయించి పూర్తి వివరాలను అభ్యర్థుల మొబైల్‌కు మెసేజ్ పెడతారు. 24నుంచి 26 వరకు అభ్యర్థులు కళాశాలలో రిపోర్టు చేయాలి.

ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే దామచర్ల ● 33,37 డివిజన్లలో కొనసాగిన సుపరిపాలనలో తొలి అడుగు ● పి.గుడిపాడులో పర్యటించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్


ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు సమస్యలను వివరిస్తున్న స్థానికురాలు


పి.గుడిపాడులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఆనందాలు నింపడంతోపాటు ప్రతి ఒక్కరి సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక 33, 37వ డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో అభివృద్ధి బాటలో తాను కూడా పనిచేస్తున్నట్లు తెలిపారు. మెగా సిటీలకు ధీటుగా ఒంగోలు నగరాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని, ముఖ్యంగా నగర సుందరీకరణ, డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం, సీసీరోడ్‌లు, డ్రైన్‌లు నిర్మించడంతోపాటు అమృత్ పథకం కింద ప్రతి ఇంటికీ ప్రతిరోజు తాగునీరు అందించే దిశగా ముందుకెళుతున్నట్లు ఆయన వెల్లడించారు. మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు కోసం పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టమని, అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరలోనే చేపడతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి 2సెంట్లు భూమి ఇస్తామని తెలిపారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఆగిపోయిన టిడ్కో ఇళ్ళు త్వరితగతిన పూర్తి చేసి దీపావళి నాటికి అందజేసామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపించినందుకు ఎల్లవేళలా అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాలు ఎత్తు పెంచాలని, పారిశుధ్య మెరుగు పరచాలని, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని, నీటి సరఫరా సక్రమంగా విడుదల చేయాలని కోరారు. దీంతో ఎమ్మెలే తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో 33వ డివిజన్ అధ్యక్షుడు నల్లూరి రవి, 37వ డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహన్‌రావు, కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, చెన్నుపాటి బ్రదర్స్ శ్రీనివాసరావు, హరిబాబు, మధుతోపాటు, నగర అధ్యక్షుడు బండారు మదన్, నిడమనూరి పావని, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోకి పెట్టుబడుల వెల్లువ : ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు: కూటమి పరిపాలనలో రాష్ట్రంలో పెద్ద పెద్ద కంపెనీలు ఏర్పాటు చేసేందుకు పెట్టుబడులతో ముందుకొస్తున్నాయని, తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పి.గుడిపాడులో మంగళవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ స్థానిక నాయకులతో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, అరికట్ల సుమతి, రామక్రిష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శంకర్, శ్రీను, బీజేపీ నాయకులు కళ్యాణ్‌రెడ్డి, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిద్దాను కలిసిన నూతన ఆర్యవైశ్య కమిటీ


శిద్దా రాఘవరావును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కల్చరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బొగ్గవరపు సుబ్బారావు, సంఘ సభ్యులతో కలిసి మంగళవారం ఒంగోలులో మాజీ మంత్రి శిద్దారాఘవరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి శిద్దా రాఘవరావు అందిస్తున్న సహకారానికి వారు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తనకు పదవి దక్కేందుకు సహకరించిన శిద్దా రాఘవరావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ, పల్లపోతు వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబరులో తాను పదవీ బాధ్యతలు చేపడతానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను శిద్దా రాఘవరావు అభినందించారు. కార్యక్రమంలో పల్లపోతు వెంకటేశ్వర్లు, శిద్దా పాండురంగారావు, పెనుగొండ శ్రీనివాసరావు, జలదంకి కృష్ణారావు, గునుపూడి భాస్కర్, కూరపాటి సత్యనారాయణ, మువ్వల శ్రీనివాసులు, పబ్బిశెట్టి భాస్కర్, చినిగేపల్లి సురేష్, దేవకి మహానంది తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొన్నలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆవులు, ఎద్దులకు సోకే ముద్దచర్మవ్యాధిపట్ల పశుపోషకులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి శివరామకృష్ణ సూచించారు. పొన్నలూరులో మంగళవారం ఆయన ముద్దచర్మవ్యాధి సోకకుండా ముందుజాగ్రత్తగా ఎద్దులకు టీకా వేశారు. ముద్దచర్మ వ్యాధి(లంపీస్కిన్) టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని ఆయన చెప్పారు.

చీమకుర్తి సొసైటీ చైర్మన్‌గా వెంకట్రావు


ఎమ్మెల్యే బీఎన్‌కు బొకే అందజేస్తున్న వెంకట్రావు

చీమకుర్తి, జూలై15(ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రాధాన్యత కలిగిని చీమకుర్తి విశాలపరపతి సహకార సంఘం చైర్మన్‌గా చీమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు పూనాటి వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా క్రిస్టిపాటి బాలబ్రహ్మారెడ్డి, యానం వెంకటేశ్వర్లును నియమించారు. సొసైటీ చరిత్రలో టీడీపీకి చెందిన వ్యక్తి చైర్మన్ కావటం ఇదే తొలిసారి. ఈ అవకాశం దక్కటానికి కారణమైన ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌ని మంగళవారం వ్యక్తిగతంగా కలిసిన పూనాటి వెంకట్రావు, సభ్యులు, నాయకులు మన్నం ప్రసాద్ తదితరులు బొకేలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ పరిధిలో రైతులకు వెన్నుదన్నుగా ఉంటానని వెంకట్రావు పేర్కొన్నారు. కాగా తమ అభిమాన నాయకుడుకు సొసైటీ చైర్మన్ పదవి దక్కడంతో పట్టణ రజక కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పూనాటి వెంకట్రావు, సతీమణి ధనలక్ష్మిలను కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ అధ్యక్షులు

సంతనూతలపాడు : మండలంలో నూతనంగా నియమితులైన సొసైటీ అధ్యక్షులు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌ను మంగళవారం ఒంగోలులో ఆయన కార్యాలయంలో మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ, మంగమూరు సొసైటీ చైర్మన్ నల్లూరి నారాయణరావు, గుర్వారెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ కురుగుంట్ల సుబ్బారెడ్డి, పేర్నమిట్ట సొసైటీ చైర్మన్ కందుకూరి(వెంకటేశ్వర్లు)బాబులు ఎమ్మెల్యేను కలిసి బొకేలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పేర్నమిట్ట సొసైటీ అధ్యక్షుడు కందుకూరిబాబులను జనసేన పార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్ : ఈఈ

ఒంగోలు క్రైం, జూలై15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు సంబంధించిన సమస్యలను లిఖితపూర్వకంగా అందజేస్తే విద్యుత్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఈఈ ఎం.హరిబాబు మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఒంగోలులోని విద్యుత్‌భవన్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో అదాలత్ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు జరుగుతుందరన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్‌ఇమానియేల్, ఎస్ఈ కట్టా వెకంటేశ్వర్లు శాఖ అధికారులు పాల్గొంటారని, విద్యుత్ అంతరాయలు, మీటర్లు, బిల్లుల సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఒంగోలు డివిజన్‌లోని ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఆగస్టు 20నుంచి 25వతేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం కె.వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ పార్టీ సభ్యులు కుటుంబ సమేతంగా మహాసభలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల నుంచి వచ్చిన బియ్యం, విరాళాలను మహాసభల కోసం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాసహాయ కార్యదర్శి ఆర్.వెంకట్రావు, అందే నాసరయ్య, వై.రవీంద్రబాబు, సయ్యద్‌యాసిన్, ఎస్‌డీ.మౌలాలి, షేక్ ఖాసీం, కొత్తకోట వెంకటేశ్వర్లు, కృష్ణగౌడ్, దేవేండ్ల శ్రీను, బాణాల రామయ్య, కె.రామకృష్ణ, విజయ, రావమ్మ, లక్ష్మి, నల్లూరి మురళీ, పి.ప్రభాకర్, కరుణానిధి పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకుడు దామచర్ల ఆంజనేయులు : మంత్రి స్వామి



తూర్పునాయుడుపాలెంలో ఆంజనేయులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, పూర్ణచంద్రరావు, ఒంగోలులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

టంగుటూరు /కొండపి, జూలై15 (ఆంధ్రజ్యోతి): మచ్చలేని నిస్వార్థ సేవకుడు మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు జయంతి సందర్భంగా మంగళవారం ఆయన టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిత్యం ప్రజలకోసం పనిచేసి దామచర్ల ఆంజనేయులు ఇచ్చిన స్ఫూర్తితో ప్రజాసేవకు పునరంకితమవుతామన్నారు. దివంగత దామచర్ల ఆంజనేయులు తనయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను తమ కుటుంబం కొనసాగిస్తుందన్నారు. అలాగే ఒంగోలులోని దామచర్ల సత్య కార్యాలయంలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో దామచర్ల ఆంజనేయులు జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్యే జనార్దన్ నివాళి

ఒంగోలు కార్పొరేషన్: మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు 96వ జయంతిని మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ తాత ఆంజనేయులు జీవితం తమకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తానని చెప్పారు. అనంతరం కేక్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.అలాగే స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురు, కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలవేసి ఎమ్మెల్యే దామచర్ల నివాళులర్పించారు.

ఉప్పుగుండూరు సొసైటీ చైర్మన్‌కు సన్మానం


చంద్రబాబుకు సత్కరించిన నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు సహకార సంఘం త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కాట్రగడ్డ చంద్రబాబును గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేస్తున్న కాట్రగడ్డ చంద్రబాబును ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ గుర్తించి చైర్మన్‌గా ఎంపిక చేశారు. దాంతో శ్రేణులు చంద్రబాబుకు శాలువా కప్పి సత్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, శేషగిరి, కనగాల కృష్ణ, గుమ్మడి చిన్నా, బెల్లం శ్రీని వాసరావు, ఆంజనేయులు, చంద్రశేఖర్, మద్దిన బంగారుబాబు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో పేస్ విద్యార్థి ప్రతిభ


రాహుల్‌ను అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు విద్య, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ చివరి సంవత్సరం చదువుతున్న ఆర్.రాహుల్ బ్యాట్మింటన్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఒంగోలులోని లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న రాహుల్ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ బహుమతిని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, రాహుల్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, కె.రూప, అప్పారావు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సీఎం చంద్రబాబును కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా సీఎం దృష్టికి ఆయన పలు అంశాలను తీసుకెళ్ళారు.

పెద్దకొత్తపల్లిలో తొలిఅడుగు

మద్దిపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పెద్దకొత్తపల్లిలో టీడీపీ నాయకులు నర్రా సురేష్‌బాబు, నల్లూరి సంజీవరావు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నుపాటి వంశీకృష్ణ, నాతాని సుధీర్‌కుమార్, నర్రా చిరంజీవి, మన్నే శేఖర్, మస్తాన్, పాడిబండ్ల అంజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై దాడులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒంగోలులో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలపై కార్పొరేషన్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పలు చోట్ల భారీగా కవర్లు ఉండటంపై వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేసి వారికి రూ.20,500 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వైష్ణవి, శానిటరీ సూపర్ వైజర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో సెప్టెంబరు 20, 21 తేదీల్లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సమ్మె ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

ఖరీఫ్ సాగుకు దారేది..?

- సీజన్ ప్రారంభమై 40రోజులు దాటినా కురవని వర్షం
- పత్తికి నీటి ఎద్దడి, ఎర్ర తెగులు
- మిర్చికి ప్రత్యామ్నాయంగా అపరాలు వేయాలన్నా
- దిగజారిన ధరలు, పెరిగిన పెట్టుబడి

పెద్ద దోర్నాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నలభైఐదు రోజులు దాటుతున్నా వర్షాలు కురవక పోవడంతో ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత రైతన్నలు సాగుదామా... సాగిల పడదామా ... మీమాంసలో ఉన్నారు. మేలో ముసురు పట్టి మోస్తరు వానతో మురిపించి వరుణుడు ముఖం చాటెయ్యడంతో సేద్యం పనులు మందగించాయి. ఇప్పటికే పలువురు రైతులు ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ వరకు బోరుబావుల కింద మండలంలో సుమారు 700 ఎకరాలు పత్తి సాగు చేశారు. అరకొర జల్లులకు వచ్చీరాని బోరు నీటి తడులతో పత్తి కొందరివి పూత, కాయ దశకు చేరుకున్నాయి. కీలక దశలో నీటి తడులు లేక కొంత భాగం బెట్టకు రాగా, మరి కొందరి పత్తికి ఎర్రతెగులు సోకి నిలువునా చనిపోతున్నాయి. ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా అయినముక్కల, జమ్మిదోర్నాల, పెద్దబొమ్మలాపురం గ్రామాల్లో అధిక మొత్తంలో తెగులు సోకినట్లు చెప్తున్నారు. ఇలాంటి తెగులు వస్తాయనే భయపడి రైతులు రెండేళ్లుగా పత్తిని వేయడం లేదు. కానీ ఈ ఏడాది తప్పని స్థితిలో అంటే మిరప విస్తీర్ణం తగ్గించి భూమిలో కొంత మేర పత్తిని విత్తారు. అయినా తెగులు నుంచి తప్పించుకోలేక పోయామని రైతులు వాపోతున్నారు.


ప్రధాన పొలానికి తరలించిన సేంద్రియ ఎరువు

మిరప వేద్దామా.. వద్దా

ఈ ప్రాంతం రైతులు వ్యవసాయమంటే గుర్తుకు వచ్చేది మిరప, పత్తి సాగు. గత నాలుగైదు ఏళ్లుగా పత్తి సాగుకు చాలా వరకు దూరంగా ఉన్నారు. మరి మిరప సాగు మొదలైనప్పటి నుంచి ఇన్నేళ్లలో మొట్ట మొదటి సారిగా మిరప సాగు చేయాలంటేనే జంకుతున్నారు. పోయిన ఏడాది మిరప ధరలు చూసి గొల్లుమంటున్నారు. ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారు. 70, 80 క్వింటాళ్ల పండిస్తే కూలీలకు అప్పు చేసి ఇవ్వాల్సి వచ్చిందని తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణ ఆవేదన వెలిబుచ్చారు. ఆ ఒక్కడి వేదనే కాదు ఏ రైతును పలుకరించినా కన్నీరే. దాంతో ఈ ఏడాది మిరప వేద్దామా వద్దా మీమాంసలో ఉండి పోయారు. సాధారణంగా ఈ పాటికే తమ వ్యవసాయ భూముల్లో నారుమడులు చేసి మిరప విత్తనాలు విత్తేవారు. లేదా షేడ్ నెట్లలో నారు పోయించేవారు. కానీ ఇప్పటికీ ఎవరూ ఆ దిశగా మొగ్గు చూపలేదు. పైగా షేడ్ నెట్ల యజమానులు కూడా ఇంకా నార్లు పెట్టేందుకు సాహసించడం లేదు. కొందరు భూములు దుక్కి చేసి మిరప సాగుకు సిద్ధం చేయగా, మరి కొందరు సేంద్రియ ఎరువులు తరలించి ఆలోచిస్తున్నారు. ధరల మాట అటు ఉంచితే వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఏదో ఒక పైరు సాగు చేసే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.


ఎర్ర తెగులు సోకిన పత్తి పైరు

అన్ని పంటలకూ తగ్గిన ధరలు

ఈ ఏడాది రైతులు ఏ పంటలు సాగు చేయాలి లాభదాయకంగా ఏ పంట ఉంది అని ఆరా తీస్తున్నారు. పత్తి సీజను దాటిపోయింది. మిరపకు ఇప్పటికీ గిట్టుబాటు ధర కనుచూపు మేర కనిపించడం లేదు. మరి ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేద్దామా అంటే వాటి ధరలు దిగజారాయి. గతేడాది మినుము రూ.8,000, ప్రస్తుతం రూ.6,300. కందులు రూ.9,000పైగా ఉంటే ఇప్పుడు రూ.6,000, ఉలవలు రూ.6,000, ప్రస్తుతం రూ3,500 పలుకుతున్నాయి. ఈ రకంగా ధరలు ఉంటే ఏవిధంగా గిట్టుబాటు అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి పైపైకి

సేద్యం చేయాలంటే పెట్టుబడి ప్రధానం. ఏటికేడు పెట్టుబడి ఖర్చు పైపైకి పోతోంది. కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందులు ధరలు అదుపులేకుండా పోతున్నాయి. ఏ పైరు వేసినా ముందుగా ట్రాక్టరుతో దుక్కి, గొర్రు, గుంటకకు రూ.3,600, అటు తర్వాత అరకలతో అంతర సేద్యం ఖర్చు ఎకరానికి రూ40,000 కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. మొత్తంగా పైరును బట్టి రూ.50,000 నుంచి రూ1,25,000 వరకు అవసరమవుతాయి.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రత్యూష

మధ్యవర్తిత్వంతో కేసులకు చక్కని పరిష్కారం

జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రత్యూష

పొదిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వంతో కోర్టు కేసులకు చక్కని పరిష్కారం లభిస్తుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి వీ ప్రత్యూష అన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వం అవగాహన వారోత్సవాల్లో భాగంగా కోర్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇద్దరు మధ్యవర్తులను ఏపీ లీగల్ సర్వీసెస్ నియమించిందన్నారు. కేసుల్లో ఇరువర్గాలకు మధ్యర్తిత్వం వహించి కేసుల పరిష్కారం కోసం వీరు కృషి చేస్తారని తెలిపారు. కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా 1కే వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణ కిషోర్, అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ ఎస్‌కే షబ్బీర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా వెంకటరెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మాలపాటి

మార్కాపురం రూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు చైర్మన్‌గా పట్టణంలోని తూర్పువీధికి చెందిన మాలపాటి వెంకటరెడ్డి మంగళవారం తన చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం పరిసర ప్రాంత రైతులకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు. రైతు సోదరులకు ప్రభుత్వం నుంచి అందిచాల్సిన సేవలను, రాయతీలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. యార్డు సిబ్బంది, నాయకులు శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు


ఉద్యోగులను అభినందిస్తున్న డీఎం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదర్శ ఉద్యోగులను డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు మంగళవారం సన్మానించారు. కండెక్టర్లు రంగయ్య, సుబ్రహ్మణ్యం, పద్మజ, నారాయణ, జీవీ రెడ్డి, డ్రైవర్లు విశ్వనాథ్‌లను సన్మానించి నగదు బహుమతులు అందించారు.

మహిళలు పథకాలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను మహిళలు ఉపయోగించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తెలిపారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని అగ్రికల్చర్ ఆఫీస్‌లో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. 3 నెలల శిక్షణ అనంతరం కుట్టు మిషన్, ముద్ర లోన్ ద్వారా రుణ సౌకర్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సుల్తాన్ బాషా, ఫిరోజ్, మహబూబ్ బీ, గఫూర్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సేవలందించండి : ఎంపీపీ

కొనకనమిట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజలకు పార్టీలకు అతీతంగా సేవలు అందించాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ పనులు సకాలంలో చేయడం లేదని అధికారులు పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి సమావేశానికి దుమ్మాకొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల అలసత్వంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. జడ్‌పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు మాట్లాడుతూ ఉపాధి పథకంలో క్షేత్రసహాయకులు గ్రామాలలో డబ్బులు కూలీల వద్ద నుంచి వసూలు చేస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చామని ఏఒక్క క్షేత్రసహాయకుడిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో ఎంపిపి ఉడుముల రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి రెవిన్యూ అధికారులు సభజరిగిన ప్రతిసారి రావడంలేదని దీంతో రెవిన్యూ సమస్యలు పరిష్కారంలో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో బయోగ్యాస్ ప్లాంట్‌ల పేరుతో వాగు, కొండ భూములను ఇచ్చేస్తున్నారని దీనివలన గ్రామాలలో పశువుల మేతకు ఇబ్బందులు జరిగే అవకాశం ఉన్నందున పశువుల మేత కోసం కొంత భూమిని కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలను తిప్పికొట్టండి


మునగపాడులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల


పథకాలను వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఎదురాళ్లపాడు, బురదపాలెం, మునగపాడు, వెలిగండ్ల, మంగాపురం గ్రామాలలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలకు కట్టుబడి కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అందజేసినట్లు చెప్పారు. సూపర్‌సిక్స్ పథ కాలలో మరో ముఖ్యమైన పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టునుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాల నిధుతో అన్నదాత సుఖీభవ త్వరలో రైతుల ఖాతాలో వేయనున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం ఇస్తున్నట్లు జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. త్వరలో మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తిచేసి తీరుతామన్నారు. తొలుత ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : ప్రజల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం పని చేస్తోందని ఎర్రగొం టడపాలెం నియోజకవర్గం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎరిక్షన్ బాబు ఇంటింటికీ వెళ్లీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు, పథకాల అమలును వివరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, షేక్ సమ్మద్ బాష, వెచ్చా హరగోపాల్, చల్లా వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, మంజూర్, శ్రీనివాసులు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : ప్రజా ప్రభుత్వం ఏడాదిలో సుపరిపాలన అందించిందని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పీవీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని శివరాంపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటిటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్‌తో నాణ్యమైన విద్యుత్

- ఎట్టకేలకు నూతన స్తంభాలు, లైన్ల ఏర్పాట్లు
- వీరభద్రాపురం సబ్‌స్టేషన్ పరిధిలో పనులు ప్రారంభం


వీరభద్రాపురం సబ్ స్టేషన్ పరిధిలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఆర్‌డీఎస్‌ఎస్ (రీ వెంపాండ్ డిస్ట్రిబేషన్ సెక్టార్ స్కీమ్) ద్వారా నూతన విద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాట పనులు ఎర్రగొండపాలెం మండలంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని వీరభద్రాపురం సబ్ స్టేషన్ పరిధిలో గడ్డమీదపల్లి, మొగుళ్లపల్లి, వీరభద్రాపురం రూరల్ ఫీడర్‌లలో ఇప్పటికే పనులు ప్రారంభైనట్లు విద్యత్ శాఖ ఏఈ అల్లూరయ్య మంగళవారం తెలిపారు. వ్యవసాయ, ఇంటి అవసరాలకు వాడుకునే విద్యుత్‌ను వేరు వేరుగా చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే అవసరాన్ని బట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ కోతలు లేకుండా చేయడమే ఈ స్కీమని వివరించారు. ఇప్పటికే త్రిపురాంతకం మండలం పూర్తి కాగా, ఎర్రగొండపాలెం మండలంలో అమాని గుడిపాడు గ్రామం లో పూర్తి కాగా గత రెండు రోజులుగా వీరభద్రాపురం సబ్ స్టేషన్ పరిధిలో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలో 10 సబ్‌స్టేషన్ పరిధిలో పనులు పూర్తి కాగానే సెకండ్ ఫేజ్‌లో ఎర్రగొండపాలెం పట్టణంలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ స్కీం పనులు పూర్తయితే విద్యుత్ కోతలు, అధిక లోడు సమస్య ఉండదని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాల గడువు పెంపు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్స్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండవ విడత ప్రవేశాలకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ వాసుబాబు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పెంచామని తెలిపారు.

చదువుతో పాటు నైపుణ్యత అవసరం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు నైపుణ్యత అవసరమని జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇందిరాదేవి అన్నారు. శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా మై భారత్ దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వి ద్యార్థులకు అవగాహన శిబిరం, వివిధ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె.మధుసూధన్, దీక్షా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీధర సాయి సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి

పెద్దారవీడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని ఏవో ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తంగిరాలపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 100 కార్డులు ఇవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. అనంతరం సాగులో ఉన్న పత్తిని పరిశీలించారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన ఉండాలి

రాచర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యా కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. వరల్డ్ యూత్ స్కిల్ డే (ఒకేషనల్ కోర్సులో భాగంగా) సందర్భంగా స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్కిల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులు భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగపడతాయని, విద్యార్థులు వాటిపై కూడా దృష్టిసారించాలని, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కోర్సులపై క్విజ్ కాంపిటేషన్ నిర్వహించి అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వృత్తివిద్య ఉపాధ్యాయులు జి చిన్న రాజన్న, జి రఘురామయ్య, సిబ్బంది మల్లికార్జున, రాము, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దోమతెరలతో డెంగీ దూరం

రాచర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : దోమతెరలు వాడడం వలన డెంగీని దూరం చేయవచ్చని వైద్య శాఖ గిద్దలూరు సబ్ యూనిట్ అధికారి జీ వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిస్ అనే దోమ కుట్టడం ద్వారా డెంగీ వ్యాప్తి చెందుతుందని ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుందని నీటిలో పెరుగుతుందని ఇది కుట్టడం ద్వారా వ్యాధి సంక్రమించి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల నివారణకు పరిశుభ్రత ప్రాముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గిరిధరశర్మ, హెచ్‌ఎం రామనాయక్, వైద్య సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు, ఎం రామాంజనేయులు, జ్యోతి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

మార్కాపురం వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న నిరసన తెలిపారు. తమ వేతనాలు పెంచాలని ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీకేఎం రఫీ, సుబ్బరాయుడు, హరి, సలాంఖాన్ పాల్గొన్నారు.

గిద్దలూరు : సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా నేలపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. జీవో నెంబరు 36 ప్రకారం కేటగిరీ వైజ్‌గా వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు మౌళాలి, మస్తాన్‌రెడ్డి, పుల్లయ్య, రంగస్వామి పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

గిద్దలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను రాష్ట్ర తనిఖీ బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ సుభాని, మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు దాడులకు నేతృత్వం వహించారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్‌లు, ఇన్‌వాయిస్‌లు, లైసెన్సు రిజిస్టర్లు, గోడౌన్లను తనిఖీ చేశారు. చీతిరాల నాగేశ్వరరావు షాపులో సర్టిఫికెట్లు లేని రూ.9.71లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. క్రిష్ణ ట్రేడర్స్‌లో 2.70 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. దాడుల్లో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసనాయక్, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు మహబూబ్‌భాషా, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లేట్లు, దుప్పట్ల పంపిణీ

గిద్దలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శంకర్‌రావు జన్మదినం సందర్భంగా స్థానిక బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల పాఠశాలలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులకు దుప్పట్లు, భోజన ప్లేట్లు, నిత్యవసర వస్తువులను అందచేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.శ్వేత, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, పలువురు మహిళ విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.

17 నుంచి గ్రామ సభలు

గిద్దలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జీరో ప్రాపర్టీ పీ4 సర్వేలో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితాలను గ్రామసభలలో ప్రదర్శించి అర్హులను గుర్తించి, అనర్హులను తొలగించేందుకు వీలుగా ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17న అంబవరం, వెల్లుపల్లి, 18న కేఎస్‌పల్లి-1, కేఎస్‌పల్లి-2, కంచిపల్లి, 19న తిమ్మాపురం, నరవ, పొదలకొండపల్లి, తంబళ్ళపల్లి, 22న ముండ్లపాడు-1, ముండ్లపాడు-2, కొమ్మునూరు, 23న కొత్తకోట, ఓబులాపురం, సంజీవరాయునిపేట, 24న ఉయ్యాలవాడ, గడికోట గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

పొదిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపవద్దని, దీనిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మంగళవారం ప్రకటనలో ఎస్‌ఐ వేమన హెచ్చరించారు. మండలంలో మైనర్లు ఎక్కువగా ద్విచక్రవాహనాలతో రోడ్లపైకి వస్తున్నారని అటువంటివారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వారికి గాని, వారివల్ల ఇతరులకుగాని ప్రమాదం జరిగితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. మైనర్లకు, లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

కంప్యూటర్ కోర్సులో బీఎల్వోలు శిక్షణ పొందాలి

ఎర్రగొండపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బీఎల్వో యాప్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బీఎల్వోల శిక్షణ మాస్టరు కృష్ణారెడ్డి తెలిపారు. ఎర్రగొండపాలెంలో మండలంలో పనిచేస్తున్న బీఎల్వోలకు మంగళవారం ఎన్నికల నిర్వాహణ, ఓట్లు చేర్పులపై శిక్షణ పొందిన కృష్ణారెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎంవీ సత్యనారాయణ, సహాయ ఎన్నికల అధికారి మంజునాథరెడ్డి, ఎన్నికల డీటీ భాస్కరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖరు, బీఎల్వోలు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంల సమస్యలపై ఆందోళన

మార్కాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఈఈ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పాత సర్వీస్ రూల్స్ ప్రకారమే గ్రేడ్-2 జేఎల్‌ఎమ్‌లకు ఏఎల్‌ఎమ్‌లుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. వివక్షపూరిత సర్వీస్ రూల్స్ వెంటనే రద్దు చేయాలన్నారు. అక్టోబర్ 2019 నుంచి సచివాలయ ఉద్యోగులకు అమలవుతున్న అన్ని రకాల సెలవులు జేఎల్‌ఎమ్ గ్రేడ్-2లకు కూడా అమలు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఈఈ నాగేశ్వరరావుకు అందజేశారు.


మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు


గిద్దలూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర 80 రోజుల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించారు. పట్టణంలో మద్యం సేవించి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన మేకల సతీష్‌కుమార్‌ను డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో భాగంగా అర్బన్ సీఐ కె.సురేష్ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

మార్కాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద బ్రిడ్జిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి బత్తుల సాంబశివరావు తలకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ అంకమ్మరావు తెలిపిన వివరాల ప్రకారం .. పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి వ్యక్తి గత పనుల నిమిత్తం మార్కాపురం వచ్చారు. మార్కాపురం నుంచి ఒంగోలు వైపు బుల్లెట్‌పై వెళుతుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక సర్వజన ఆసుపత్రిలో చికిత్సనందించారు. సాంబశివరావు కోమాలో ఉన్నారని ఎస్‌ఐ అంకమ్మరావు తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు

కొమరోలు, ఇడమకుల్లు సొసైటీ చైర్మన్‌ల నియామకం


సంజీవరెడ్డి


రవీంద్రారెడ్డి

కొమరోలు, జులై15(ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలంలోని కొమరోలు, ఇడమకల్లు సహకార సంఘం చైర్మన్‌లుగా ముత్తుముల సంజీవరెడ్డి, బిజ్జం రవీంద్రారెడ్డిని ప్రభుత్వం నియమించింది. కొమరోలు విశాల సహకార సంఘం చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డిని నియమించారు. సంజీవరెడ్డి ఎంపీటీసీ సభ్యుడిగానూ, ఎమ్మెల్యే కుటుంభ సభ్యులుగా ప్రజలకు మంచి సేవలను అందించారు. ఈయన రైతులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటారు. మండలంలోని ఇడమకల్లు సహకార సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన రవీంద్రారెడ్డి జిల్లా రైతు ప్రధాన కార్యాదర్శిగా పనిచేసి రైతులకు తన వంతు సహాయసహకారాలను అందించారు. మండలంలోని దద్దవాడ గ్రామానికి చెందిన బిజ్జం రాజారెడ్డి కుమారుడు బిజ్జం రవీంద్రారెడ్డిని చైర్మన్‌గా నియమించారు. వీరి నియామకంపై మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి తెలిపారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ దాడులు

దొనకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ అమ్మకాలను నిరోధించటంలో భాగంగా మండలంలోని బెల్ట్‌షాపులపై దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో మంగళవారం దాడులు నిర్వహించారు. కొచ్చెర్లకోట గ్రామానికి చెందిన సుబ్బయ్య అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వీఆర్ సత్యనారాయణరావు, సిబ్బంది శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పామూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆనందం కలుగుతుందని పిరమిడ్ ధ్యానకేంద్రం అధ్యక్షుడు పందిటి అల్లూరయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారం తీసుకోవడం ద్వారా ప్రశాంతత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.తిరుపతిరెడ్డి, జి.రమణయ్య, కె.ప్రభాకర్, పి.సౌభాగ్యం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

పామూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలో గల కమ్మవారిపాలెంలో మంగళవారం పోలేరమ్మ తల్లికి పాల పొంగళ్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం శాంతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త అడుసుమల్లి వెంగయ్య, చైర్మన్ అడుసుమల్లి నరశింహులు, దుద్దుకూరు మల్లికార్జున, గుర్రం నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో గ్రామోత్సవం

సీఎస్‌పురం(పామూరు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురం గ్రామంలో పీర్లల్ల పండుగ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పెద్దపీర్ల గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా పీర్లను అలంకరించి తప్పెట్లు, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పీర్లను జండాబావి వద్దకు జలధి స్నానం కోసం తీసుకెళ్లడంతో పీర్ల పండుగ ముగిసినట్లు ముజవర్లు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసా అన్నారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వరల్డ్ యూత్ స్కిల్‌డే వేడుకలకు హెచ్‌ఎం అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ బి.రాధాకృష్ణ, ఎం.రవి, మహేష్ పాల్గొన్నారు.

హరిబాబును సన్మానించిన టీడీపీ శ్రేణులు

పామూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పామూరు సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన తెలుగుయువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, సభ్యుడు వై .రహీముల్లాను టీడీపీ శ్రేణులు మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎన్.సాంబయ్య, ముబినామౌలాలి, పాలపర్తి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలివ్వాలి

కనిగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెం.36 ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు పీసీ కేశరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కురిచేడులో ఆధార్ కేంద్రం

కురిచేడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కురిచేడు సచివాలయం-2లో మంగళవారం ఆధార్ కేంద్రం ప్రారంభమైంది. గతంలో కురిచేడులో ఆధార్ కేంద్రం ఉన్నా ఇక్కడి సిబ్బంది బదిలీతో నిలిచిపోయింది. ఆవులమందలో మాత్రమే ఆధార్ కేంద్రం నడుస్తుంది. దీంతో మండలవాసులు అక్కడి వరకు వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడ్డారు. ఈవిషయమై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మికి మండల వాసులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆమె కృషితో మంగళవారం కురిచేడు-2 సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ రజనీ కుమారి, ఎంపీడీవో ప్రారంభించారు.

గౌతమ్‌కు అవార్డు

తాళ్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం నరసరావుపేటలో నిర్వహించిన సదస్సులో శ్రీగురు పురస్కార్ అవార్డును మండలంలోని బొద్దికూరపాడు గ్రామవాసి గాజులపల్లి గౌతమ్ అందుకున్నారు. అవార్డు పొందిన గౌతమ్‌ను గ్రామస్థులు ఎస్.అంజిరెడ్డి, పి.సుబ్బారెడ్డి, పలువురు ప్రముఖులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

» డీఈవో కిరణ్‌కుమార్


ముండ్లమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రార్థనా గీతంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్

ముండ్లమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో కిరణ్‌కుమార్ అన్నారు. ఆదిశగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఎక్కువమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మంగళవారం ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు పాఠశాలకు ఎంత మంది విద్యార్థులు వస్తున్నారని హెచ్‌ఎం మాధవీలతను ప్రశ్నించారు. 191 మంది విద్యార్థులకు గాను 93 మందే హాజరయ్యారని తెలిపారు. ఇంత మంది ఎందుకు రాలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలపై విద్యార్థులకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనంతో పాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందజేసిందన్నారు. పాఠశాలల్లో హాజరు శాతాన్ని కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రార్థన నిర్వహణ సక్రమంగా లేదని, విద్యార్థులు తక్కువగా ఉన్నారని డీఈవో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పాఠశాల క్రీడా స్థలాన్ని పరిశీలించారు. హాజరు రోల్‌కు, ప్రార్థనకు తేడా ఉండకూడదని సూచించారు. నూరు శాతం హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

» డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు


కెల్లంపల్లిలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డీపీవో వెంకటనాయుడు

ముండ్లమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. తడి, పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయం ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. మంగళవారం మండలంలోని కెల్లంపల్లి పంచాయతీని సందర్శించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధులు రాకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. కెల్లంపల్లి పంచాయతీని ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీగా ఎంపిక కావటంతో పలువురుకు ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. ఈ పంచాయతీలో ఏడు గ్రామాలు ఉండటం వల్ల గ్రీన్ అంబాసిడర్లకు చెత్త సేకరణలో ఇబ్బందులు ఉన్నాయని సంబంధిత అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెత్త సంపద కేంద్రాల్లో వర్మి కంపోస్టు, పొడి చెత్తను అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు, వీధి లైట్లు, తాగు నీరు లాంటి వాటికి వినియోగించుకోవచ్చునని డీపీవో చెప్పారు. ప్రధానంగా రహదారికి ఇరువైపులా చెత్తను వేయకుండా చూడాలన్నారు. అలావేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నెయ్యి దిబ్బలు ఉంచరాదన్నారు. ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చి నెయ్యి దిబ్బలు తీయించాలన్నారు. వీటివల్ల వర్షాకాలంలో నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్.జనార్దన్, సర్పంచ్ జమ్ముల గురవయ్య, పంచాయతీ కార్యదర్శి గురునాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలి

» ఏడీఏ బాలాజీనాయక్


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

ముండ్లమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలని దర్శి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సింగనపాలెం, వేంపాడులో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటలు సాగుచేసే ముందు వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 950 మంది రైతులకు సంబంధించిన పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందజేసినట్టు చెప్పారు. రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వాడవద్దన్నారు.

కార్యక్రమంలో ఏవో తిరుమలరావు, ఏఈవో శ్రీకీర్తి, వీఏఏలు త్యాగరాజు, రజాక్, ఆత్మా బీటీఎం నాగభూషణం, ప్రభాకర్, డి.యోగేశ్వరమ్మ, చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలి

తాళ్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పొగాకుకు పత్యామ్నాయ పంటలు సాగు చేయాలని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం తాళ్లూరు1,2 రైతు సేవా కేంద్రాల వద్ద జరిగిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ వంటి పొగాకు పంటలు వేయవద్దన్నారు. ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. చిరుధాన్యాలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు వరి రైతులకు బీమా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం నాగభూషణం, సెరికల్చర్ టీఏ రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు


వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఈఈ హైమావతి, దర్శి ఈఈ శ్రీనివాసులు, తదితరులు

దర్శి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ టి.హైమావతి, దర్శి ఈఈ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది 33 బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. అక్రమ విద్యుత్ వాడుతున్న 12 మందికి రూ.15 వేలు చొప్పున జరిమానాలు విధించారు. మీటర్లు పెట్టుకొని అనుమతికి మించి విద్యుత్ వాడుతున్న 11 మందికి రూ.56 వేలు జరిమానా విధించారు. మొత్తం లక్షా నలభై రెండు వేల రూపాయలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ విద్యుత్ వాడుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మొదటి తప్పుగా అపరాధ రుసుంతో సరిపెట్టామని, మరోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్య క్రమంలో డీఈఈలు పి.రవికుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను అడ్డుకోవాలి



పీవీఆర్ పార్కులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరోజిని

కనిగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణాను అడ్డుకోవాలని సీడీపీవో సరోజిని అన్నారు. ప్రపంచ బాలల అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, బంగారుబాల్యం, గుడ్‌హెల్ప్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బాలల అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను అక్రమ రవాణా చేయటం చట్టరీత్యా నేరమన్నారు. పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు చెందిన పిల్లలను గుర్తించి వారి పెద్దలను డబ్బులతో ప్రలోభపెట్టి చిన్నారులను, బాలికలను రవాణా చేస్తుంటారన్నారు. అలాంటి సందర్భం, సంఘటనలు ఎక్కడ జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాలికలపై వేధింపులు, అసాంఘిక చర్యలు వంటివి, వారి అసభ్యకరమైన ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాల్లో పోస్టులు పెట్టిన వారి వివరాలను సమాచారం అదించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, సూపర్‌వైజర్ సుమతి, సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

» పెద్దన్నపల్లిలో విరిగిన విద్యుత్‌స్తంభం
» తొలగించని సిబ్బంది
» ఆందోళన చెందుతున్న గ్రామస్థులు


పెద్దన్నపల్లిలో విరిగిపోయిన విద్యుత్‌స్తంభం

పీసీపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌స్తంభం విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్న సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదు. గ్రామం మధ్యలో రోడ్డుపక్కన ఉన్న ఈ విద్యుత్‌స్తంభం ఎప్పుడు పడిపోయి ఏప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామంలో ఆర్డీఎస్ పనుల్లో భాగంగా పాత స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటుచేసి తీగ లాగి కనెక్షన్ ఇచ్చారు. కొద్దినెలల క్రితం స్తంభం సమీపంలో ఇంటి ముందు ట్రాక్టర్ నిలిపిఉంచారు. పిల్లలు ఆడుకుంటూ ట్రాక్టర్ గేర్‌ను న్యూట్రల్‌లో పెట్టి వెళ్లిపోయారు. పిల్లలు వెళ్లిన కొద్దిసేపటికి ట్రాక్టర్ రివర్స్‌లో వెళ్లి విద్యుత్ సంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి పోయింది. ప్రస్తుతం స్తంభంలోని తీగల సపోర్ట్‌తో నిలబడి ఉంది. విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామస్థులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

ఈ విరిగిన స్తంభం పీసీపల్లి-కనిగిరికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉంది. ఆ మార్గంలో రోజూ పాఠశాల బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. గ్రామస్థులు రోజూ అమార్గం గుండానే పొలం పనులకు వెళ్లివస్తుంటారు. ఈ స్తంభం ఎప్పుడు కూలి ఏ ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

లైన్‌మన్‌లేక గ్రామస్థుల ఇబ్బందులు

పామూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడవాడ గ్రామానికి గత ఆరు నెలల నుంచి లైన్‌మన్ లేదు. దీంగో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులు వీచినప్పుడు తీగలు తగిలి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దాంతో సరఫరాలేక పొలాల్లో పండిస్తున్న పశువుల మేత ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఉన్నప్పుడు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే తాత్కాలికంగా విద్యుత్ హెల్పర్‌ను పంపించి సమస్యను సరిపెడుతున్నారన్నారు. ఒకవైపు విద్యుత్ సమస్యలు లేకుండా 24 గంటలు అందిస్తామని మంత్రులు చెబుతున్నా ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైన్‌మన్‌ను నియమించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను, విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తిచేసినా స్పందించేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోడవాడ గ్రామానికి లైన్‌మన్‌ను నియమించి విద్యుత్‌కష్టాలను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.


గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణసేన్‌తో చర్చిస్తున్న కృపారావు

దొనకొండ రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్‌ఎం

దొనకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో భాగంగా దొనకొండ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుదేష్ణసేన్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్లో దొనకొండకు చేరుకున్న డీఆర్‌ఎం రైల్వేస్టేషన్‌లోని రెండు ప్లాట్‌ఫారాలు, వివిధ కార్యాలయాలకు చెందిన గదులను పరిశీలించారు. ఈసందర్భంగా మాజీ జడ్పీటీసీ పులిమి రమణా యాదవ్, రిటైర్డ్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కోలా కృపారావు, బీజేపీ నాయకులు రొడ్డా వెంకట్రావు, పోతురాజు వెంకటరామయ్య తదితరులు డీఆర్‌ఎంను సన్మానించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని, రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. డీఆర్‌ఎం వెంట ఏడీఆర్‌ఎం రమేష్‌బాబు, సీనియర్ డీఈఎన్ (కోఆర్డినేషన్)శ్రీనివాసరావు, డిప్యూటీ సీఈ నోయల్ ప్రాన్సిస్, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్, తదితరులు ఉన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగసుబ్బారెడ్డి


ఏఎంసీ డైరెక్టర్ నాగసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మోడి అంజనేయులు తదితరులు

దొనకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన శృంగారపు నాగసుబ్బారెడ్డిని మంగళవారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. దర్శి మార్కెట్ యార్డు కార్యాలయంలో డైరెక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మోడి అంజనేయులు, నాయకులు నిమ్మకాయల సుబ్బారెడ్డి, కృష్ణాచారి తదితరులు నాగసుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏఎంసీ డైరెక్టర్‌గా తన ఎంపికకు కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులకు నాగసుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీలకు నూతన కార్యవర్గం


కె.చంద్రశేఖర్


దామా కృష్ణ

దర్శి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శి, తూర్పువెంకటాపురం సొసైటీలకు ప్రభుత్వం నూతన కార్యవర్గాన్ని నియమించింది. దర్శి సొసైటీ అధ్యక్షుడిగా కె.చంద్రశేఖర్, సభ్యులుగా కుప్పాల పాపారావు, ఆకుల వెంకటరావు, తూర్పు వెంకటాపురం సొసైటీ అధ్యక్షుడిగా రాజంపల్లి గ్రామానికి చెందిన దామా కృష్ణ, సభ్యులుగా వై.వెంకారెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బోడవాడ గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లబ్ధిదారులను ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకొన్నారు. సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ దాసరి మాలకొండయ్య, డొడ్డా కోటిలింగం, దాసరి రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిసిన చెరుకుపల్లి


ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన చెరుకుపల్లి

సీఎస్‌పురం(పామూరు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం సింగిల్ విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన చెరుకుపల్లి వెంకటరెడ్డి మంగళవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పర్సన్‌ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వెంకటరెడ్డిని ఉగ్ర అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఉగ్రను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, డైరెక్టర్లు తోట నారాయణ, దేవెండ్ల నాగరాజు, మన్నెపల్లి రమేష్, తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలే ఉపాధికి పునాదులు

తాళ్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల ఆధారంగా ముందుకు సాగితే జీవన ఉపాధికి పునాదులుగా నిలుస్తాయని తూర్పుగంగవరం జిల్లాపరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. తూర్పుగంగవరం జడ్పీహైస్కూల్‌లో ఒకేషనల్ ట్రైనర్స్ వై.అంజిబాబు, సీహెచ్ దావీదు ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్‌డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, రోల్‌ప్లే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాజీ, ఖాజావలి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మస్తానయ్య, శ్రీదేవి, మేరీ మాధవి, శివనాగరాజు పాల్గొన్నారు.

వీవోఏ తొలగింపుపై వివాదం

తాళ్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో మండలంలోని వెలుగుక్రాంతి పథకం కింద మండలంలో దీర్ఘకాలంగా పనిచేసిన వీవోఏలను (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) నిబంధనల మేరకు తొలగించి కొత్తవారిని నియమించారు. మండలంలో 39 మంది వీవోఏలు ఉండగా ఎక్కువ మంది స్వచ్ఛందంగా మానుకోగా, కొందరిని నిబంధన మేరకు తొలగించారు. తూర్పుగంగవరం గ్రామసంఘంకు చెందిన వీవోఏ ప్రమీలారాణి దీర్ఘకాలంగా పని చేస్తున్నందున తొలగించి కొత్తవారిని నియమించేందుకు మార్చి నుంచి ఇప్పటివరకు మూడు నోటీసులు పంపారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా దాట వేస్తుండటంతో ఈనెల 11న వెలుగు ఏపీఎం, సీసీలు వీవోఏ ఇంటికి వెళ్లి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఆకారణంగా ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించగా, ఐదేళ్లు పూర్తయినందున నిబంధనల మేరకు సమావేశం ఏర్పాటుచేసి సభ్యుల ఆమోదం మేరకు తగు నిర్ణయం తీసుకోవటం జరుగుందని ఏపీఎం తెలిపారు. దీంతో వీవోఏ ప్రమీల సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏపీఎం అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదుచేశారు. పోలీసులు ఏపీఎంను స్టేషన్‌కు పిలిపించి జరిగిన ఘటనపై విచారించారు. వీవోఏ ప్రమీల నింబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఈఓఎస్ గ్రూపు నుంచి తొలగించారు. ఏపీఎం తనపై కక్షగట్టి తనను తొలగించారని పేర్కొంటూ ప్రమీల ఆదివారం ఇంటిలో చీరెతో ఉరి వేసుకోబోగా కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. ఒంగోలు రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించగా కోలుకున్నట్లు సమాచారం.

కాగా, వీవోఏ తొలగింపులో టీడీపీ నేతలు ఎవరూ వేధించలేదని ఆపార్టీ నాయకులు కనిశెట్టి రామలక్ష్మయ్య, ధానీ తెలిపారు.





పర్చూరు మండలం అడుసుమల్లిలో పెసల సేకరణ (ఫైల్‌ఫొటో)

రేసులో.. ఆ ఇద్దరు



చీరాల మున్సిపల్ కార్యాలయం

చీరాల మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ ఖాతాలో పడడం దాదాపు ఖాయమే...అది కూడా ఏకగ్రీవంగానే...ఇక మిగిలిందల్లా ఆ అదృష్టం ఎవరిని వరించనుందోననే ఉత్కంఠ మాత్రమే...దీనికి కూడా మరికొన్ని గంటల్లో తెరపడనుంది. అవిశ్వాసంతో చైర్మన్ జంజనం శ్రీనివాసరావును గద్దె దింపడం మొదలుకుని ఎన్నో మలుపులు తిరిగిన చీరాల మున్సిపల్ చైర్మన్ అంకం తుది ఘట్టానికి చేరింది. చైర్మన్ ఎన్నిక బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ ఎన్నిక, మధ్యాహ్నం 12 గంటలకు వైస్ చైర్ పర్సన్ ఎన్నిక జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. చైర్మన్ పదవి కోసం పలువురు పోటీ పడినా తుది రేసులో ఇద్దరు మాత్రమే మిగిలినట్లు సమాచారం.

- చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడే
- మించాల, పొత్తూరు.. లో ఒకరు?
- అదిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటున్న ఎమ్మెల్యే
- ఉత్కంఠకు తెరదించనున్న ఇన్‌చార్జి మంత్రి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అధిష్ఠానం నిర్ణయం మేరకు చైర్మన్ అభ్యర్థి పేరును ప్రకటించడానికి బుధవారం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి చీరాల రానున్నారు. ఎన్నిక అంకానికి గంట ముందు పేరును ప్రకటించడంతో పాటు అధిష్ఠానం మనోగతాన్ని కూడా కౌన్సిలర్లకు మంత్రి వివరించనున్నారు. కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, పొత్తూరు సుబ్బయ్యలు మాత్రమే తుది రేసులో ఉన్నట్లు సమాచారం. ఇద్దరిలో సుబ్బయ్య ఎన్నికలకు ముందే పచ్చ కండువా కప్పుకుని పార్టీ గెలుపు కోసం కృషి చేయగా, చైర్మన్‌పై అవిశ్వాసం మొదలు తాజా పరిణామాల వరకు ఆర్థిక పరమైన అండదండలందించడంలో మించాల ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో తుది రేసులో వీరిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో ఇద్దరు చైర్మన్ గిరీ కోసం పోటీ పడినా బరిలో నిలవలేక పోయారు

దాదాపుగా ఏకగ్రీవమే...

అధిష్ఠానం ఎవరిపేరును ప్రకటించినా మద్దతు ఇవ్వాల్సిందేనన్న సంకేతాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే కొండయ్య పంపారు. అంకెల లెక్కలు కూడా టీడీపీకి పూర్తి అనుకూలంగా ఉండడంతో చైర్మన్ ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవం అయ్యే సూచనలే కనబడుతున్నాయి. ఒక వేళ ఎన్నిక జరిగినా మొత్తం 33 మంది కౌన్సిలర్లలో టీడీపీకి ప్రస్తుతం 21 మంది మద్దతు ఉంది. వీరికి అదనంగా ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు కూడా ఉండడంతో గెలుపు నల్లేరు

(తరువాయి 4లో..)

మద్దతు.. మమ

- దిగుబడులు కొండంత
- మార్క్‌ఫెడ్ సేకరించింది గోరంత
- బహిరంగ మార్కెట్ వైపే రైతుల మొగ్గు
- మొక్కజొన్న కొనుగోళ్ల ఊసేలేదు
- జొన్న, శనగ విషయంలో తెరవని ఖాతా

దిగబడుల చూస్తే లక్షల టన్నుల్లో...కానీ మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ సేకరించింది చూస్తే వేల టన్నులకే పరిమితం. బహిరంగ మార్కెట్‌లో ధర ఏమన్నా అధికంగా ఉందా అంటే అదీ లేదు. మద్దతు ధర కన్నా తక్కువగానే ఉంటూ వచ్చింది. జొన్న, పెసలు, మినుములు, శనగ, కందులు వీటి సేకరణ కోసం మార్చి మూడో వారం నుంచే మార్క్‌ఫెడ్ జిల్లా వ్యాప్తంగా 62 కొనుగోలు కేంద్రాలను తెరిచిన సంగతి తెలిసిందే. దాదాపు మూడు నెలల పాటు జిల్లాలో కొనుగోళ్లు సాగాయి. జూన్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. దిగుబడుల్లో దాదాపు 75 శాతం బహిరంగ మార్కెట్‌కే తరలిపోయినట్లు మార్క్‌ఫెడ్ సేకరించిన గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మార్క్‌ఫెడ్ అనుమతి ఇచ్చిన పంటల సంగతే ఇలా ఉంటే జిల్లాలో గణనీయంగా దిగబడులు ఉన్న మొక్కజొన్న విషయంలో మార్క్‌ఫెడ్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సేకరణ అంకం ముగించారు. వేలల్లో రైతాంగం ఉంటే కేవలం 658 మంది రైతుల వద్ద నుంచి 1094 మెట్రిక్ టన్నుల దిగుబడులను మాత్రమే మార్క్‌ఫెడ్ సేకరించగలిగింది. మద్దతుధర అలంకారప్రాయమే తప్ప అన్నదాతలకు ఉపయోగపడడమే లేదనేది సేకరణ లెక్కలు చెబుతున్నాయి. దిగుబడులకు, మార్క్‌ఫెడ్ సేకరణకు మధ్య భారీ తేడా ఉండడం వెనక గత ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రస్తుతం వ్యవస్థల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా కనబడుతోంది

జిల్లాలో దిగుబడుల అంచనా ఇలా...

పెసల దిగుబడి జిల్లా వ్యాప్తంగా 8,000 టన్నుల వరకు ఉండొచ్చనేది వ్యవసాయశాఖ లెక్కకట్టింది. దీనికి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 8,682గా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.800 వరకు తక్కువగానే నడిచింది. సేకరణ లక్ష్యాన్ని 3,500 టన్నులుగా మార్క్‌ఫెడ్ నిర్దేశించుకోగా 913 టన్నులతో సరిపెట్టారు. అదే విధంగా కందికి మద్దతుధర 7,550గా ఉండగా జిల్లాలో సాగు పరిమితంగానే ఉండడంతో 190 టన్నుల లక్ష్యాన్నే విధించుకున్నారు. ఇది కూడా 143 టన్నుల వద్దే మార్క్‌ఫెడ్ ఆగిపోయింది. మినుములు జిల్లాలో దాదాపు 25,000 టన్నుల వరకు దిగుబడులు ఉంటాయనే అంచనాలు ఉండగా సేకరించింది అతి స్వల్పంగా 37 టన్నులకే పరిమితమైంది. ఇక శనగ, జొన్న విషయంలో అయితే మార్క్‌ఫెడ్ ఖాతానే తెరవలేదు.

658 మంది దగ్గరే కొనుగోళ్లు

జిల్లా వ్యాప్తంగా 2,158 మంది రైతులు తమ ఉత్పత్తులను మార్క్‌ఫెడ్‌కు అమ్ముకోవడానికి రిజిష్టర్ చేసుకుంటే ముగింపుకొచ్చేసరికి ఈ సంఖ్య 658 మంది రైతుల వద్దే ఆగిపోయింది. కంది, మినుములు, పెసలును మాత్రమే మార్క్‌ఫెడ్ మద్దతు ధరకు రైతుల వద్ద నుంచి సేకరించగలిగింది. అది కూడా మొత్తం 1094 టన్నులకే పరిమితమవడం విస్మయపరిచేదిలా ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే జిల్లాలో మొక్కజొన్న దాదాపు 24,000 హెక్టార్లలో సాగయింది. దీనిని మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించాలనే డిమాండ్లు రైతుల వద్ద నుంచి పెద్ద ఎత్తున

(తరువాయి 4లో..)

స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుకర్‌గుప్తా, పక్కన నీలంసాహ్ని



- రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్ డాక్టర్ మధుకర్‌గుప్తా

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్స్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ మధుకర్‌గుప్తా తెలిపారు. జిల్లాలో స్థానిక ఎన్నికల నిర్వాహణకు సంబంధించి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం ఎన్నికల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డీలిమిటేషన్, రిజర్వేషన్ అమలు పరిశీలించాలని, ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. రాజకీయంగా ప్రభావితం చేసే అంశాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. గత ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకొని రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతతో వ్యవహరించాలి : ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని

అధికారులు బాధ్యతతో ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలోను 50శాతం మహిళలకు రిజర్వేషన్ అమలు చేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో డీపీవో ప్రభాకరరావు, గుంటూరు, ప్రకాశం జడ్పీ సీఈవోలు జ్యోతిబసు, చిరంజీవి, ఆర్డీవో పి.గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణ.. వ్యాపారం

- ట్రాఫిక్ జాంతో పాటు ప్రమాదాలు

చెరుకుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత మండలాలకు రవాణా కేంద్రంగా ఉన్న చెరుకుపల్లిలో ప్రధాన రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. వాహనాలు తిరిగేందుకు వీలు లేకుండా రోడ్లపైనే వ్యాపారులు చేసుకుంటున్నారు. చెరుకుపల్లి నుంచి వెళ్లే 216 జాతీయరహదారిని కూడా ఆక్రమణదారులు వదల్లేదు. పొన్నపల్లిలోని మేరీరోజ్‌బడ్స్ స్కూల్ నుంచి ఆరుంబాక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వరకు ఇరువైపులా సగం రోడ్డు తోపుడు బళ్లతో నిండిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ జాంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గుళ్లపల్లి కోటిసెంటర్, అంబేద్కర్ సెంటర్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లోని వ్యాపారులు రోడ్డు మార్జిన్ల ఆక్రమించి సైన్‌బోర్డులు, క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. గతనెలలో ఒక్కరోజులోనే నాలుగు ప్రమాదాలు చోటుచేసుకోగా వ్యాపారులను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. అయినా 15 రోజులుగా పట్టించుకున్న వారే లేరు.



అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డు ఆక్రమించి వ్యాపారం..



వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో..



చెరుకుపల్లి మెయిన్‌సెంటర్‌లో..

చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలి

- వర్క్‌షాపులో కమిషనర్ రఘునాథరెడ్డి సూచన

బాపట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే చెత్తను వేరు చేయడం, చెత్త నిర్వహణ సాధ్యమౌతుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె, పొన్నూరు పురపాలక సంఘాల కమిషనర్లు, ఇంజనీర్లు, ప్రజాఆరోగ్య సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన ద్వారా సత్ఫలితాలు సాధిస్తామన్నారు. చీరాల కమిషనర్ అబ్దుల్ రషీద్, పొన్నూరు కమిషనర్ ఎం.రమేష్‌బాబు, రేపల్లె కమిషనర్ కె.సాంబశివరావు వారి పురపాలక సంఘాల్లో జరుగుతున్న చెత్త సేకరణ, విభజన గురించి వివరించారు. వర్క్‌షాపులో అకాడమీ ఆఫ్ గాంధీ అండ్ స్టడీస్‌కు చెందిన గోపాలకృష్ణమూర్తి, ఏజీఎస్ ప్రతినిధి యు.ఉమామహేశ్వరి, ఎఫర్ట్ ఎన్జీవో ప్రతినిధి యు.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథరెడ్డి

సీఎస్ఈ.. కావాలి

- సాఫ్ట్‌వేర్ బ్రాంచీలకే డిమాండ్
- కంప్యూటర్ సైన్స్‌లో పది ఉప బ్రాంచీల ఏర్పాటు
- వెబ్ కౌన్సెలింగ్‌లో ఎక్కువ మంది విద్యార్థుల ఆసక్తి
- సివిల్, మెకానికల్ బ్రాంచీలను ఎత్తేసిన సగం కాలేజీలు

గుంటూరు(విద్య), జూలై 15 (ఆంధ్ర జ్యోతి): బీటెక్ అంటే నేటి తరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో సాఫ్ట్‌వేర్ సంబంధిత కంప్యూటర్ సైన్స్(సీఎస్సీ) ఒక్కటే అనే భావం నెలకొంది. పెద్ద యూనివర్సిటీల నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎక్కడైనా విద్యార్థులు సీఎస్సీ లేదంటే ఆ పేరుతో ఏర్పాటు చేస్తోన్న ఉప బ్రాంచ్‌లపైనే నూటికి 90 శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజుల నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఆదివారం నుంచి విద్యార్థులు కోర్సులు, కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఏఈపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో అత్యధికమంది సీఎస్ఈ లేదంటే దాని ఉప బ్రాంచ్‌ల్లో చేరేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గుంటూరు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర జిల్లాల విద్యార్థులు భారీ సంఖ్యలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈఏపీ సెట్‌లో 25 వేల మంది విద్యార్థులు అర్హత సాధించగా 30 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులతో పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాగార్జున యూనివర్సిటీ(గుంటూరు), జేఎన్‌టీయూకే (నరసరావుపేట) క్యాంపస్‌లతో పాటు 36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. గతంలో ఆయా కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్ మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ తదితర బ్రాంచీలు ప్రధానంగా ఉండేవి. అయితే నాలుగైదేళ్ల నుంచి సీఎస్సీలో వచ్చిన సబ్ బ్రాంచీల కారణంగా సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఒక్క సీఎస్సీలోనే దాదాపు పది ఉప బ్రాంచీలు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో సీఎస్సీలో రెండు బ్రాంచ్‌లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఏఐఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐటీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉప దాదాపు పది బ్రాంచ్‌లను ఏర్పాటు చేశారు. 36 కాలేజీల్లో సగం కాలేజీల్లో సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో సీట్లు భర్తీ కావడం లేదు. దీంతో క్రమంగా కళాశాలలు వీటిని ఎత్తివేసి కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన బ్రాంచ్‌లను ప్రవేశపెడుతున్నాయి.

భారీ ప్యాకేజీల మోజుతో..

ఇంజనీరింగ్‌లో సీఎస్సీ ఐటీ బ్రాంచ్‌ల్లో అత్యధికంగా విద్యార్థులు చేరడానికి కారణం భారీ ప్యాకేజీలే కారణమని అధ్యాపకులు చెబుతున్నారు. సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ప్రారంభ జీతం రూ.15 వేల నుంచి 25 వేల లోపు ఉంటే కంప్యూటర్ బ్రాంచీల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకు ప్రారంభ జీతం ఉంటోంది. దీనికి తోడు వైట్ కలర్ ఉద్యోగుల మాదిరి ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయవచ్చు. దీనికి తోడు ఉద్యోగులకు ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఫలితంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే బ్రాంచీల వైపే విద్యార్థులు మొగ్గ చూపుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉపాధి అవకాశాలు ఉన్నా...

తొలుత బీటెక్‌లో మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉండేవి. కంప్యూటర్ కోర్సు రావడం.. గత కొన్నేళ్లుగా విద్యార్థుల్లో నెలకొన్న పరిణామాలతో మెకానికల్, సివిల్, కెమికల్ బ్రాంచీల్లో నిరాదరణకు గురయ్యాయి. ప్రధానంగా ఆయా బ్రాంచీల్లో డిగ్రీలు చేస్తే ఉపాధి కష్టమన్న భావన విద్యార్థుల్లో నెలకొందని కళాశాలల ప్రిన్సిపాల్స్ చెప్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదంటున్నారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్మాణ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయి. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ప్లాంట్లలో అత్యధిక గంటలు నిల్చొని పనులు చేయాల్సి ఉంటుంది. ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయడానికి అవకాశాలు చాలా తక్కువ కావడంతో ఈ బ్రాంచ్‌లకు విద్యార్థుల నుంచి డిమాండ్ తగ్గింది.



యూటూబ్‌లో చూసి బుల్లెట్ల మాయం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్‌లు

- వ్యసనాలతో ఇంజనీరింగ్ విద్యార్థులు చోరీల బాట
- ఏడుగురి ముఠా అరెస్టు.. 16 బుల్లెట్లు, ఒక స్కూటీ స్వాధీనం

అద్దంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారంతా ఇంజనీరింగ్ విద్యార్థులు. వ్యసనాలకులోనై చోరీల బాటపట్టారు. హ్యాండిల్ లాక్ ఎలా తీయాలి, ఎలా స్టార్ట్ చేయాలని యూట్యూబ్ ద్వారా తెలుసుకుని బుల్లెట్లను అపహరిస్తున్న ఏడుగురు విద్యార్థుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట పోలీసులు హాజరు పరిచారు. ఇందుకు సంబంధించి చీరాల డీఎస్పీ మొయిన్ వెల్లడించిన వివరాలు.. ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన పల్లా సాయిరాం, జరుగుమల్లి మండలం యడ్లూరిపాడుకు చెందిన దివి వేణుగోపాల్, కొత్తపట్నం మండలం ఆలూరుకు చెందిన అక్కల వెంకటసాయిరెడ్డి, దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి చెందిన రాయపూడి వసంతకుమార్, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం నార్లగెడ్డ గోవిందరాజు, నెల్లూరు జిల్లా కావలి మండలం చౌదరిపాలేనికి చెందిన కోడెల పవన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం కొత్తపెండ్యాలకు చెందిన జీనేపల్లి నరేంద్రవర్మ ఒంగోలులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఒంగోలులోని వీఐపీ రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక సమీపంలో ఉండే వీరంతా వ్యసనాలకు లోనయ్యారు. ద్విచక్ర వాహనాలను అపహరించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో యూట్యూబ్‌లో బుల్లెట్ అపహరణ గురించి తెలుసుకున్న గోవిందరాజు స్నేహితులకు వివరించాడు. తొలుత కొటప్పకొండ తిరునాళ్లలో బుల్లెట్ వాహనాన్ని దొంగిలించారు. ఆ తర్వాత వరుసగా సింగరకొండ తిరునాళ్లలో, అద్దంకి, కాకానిపాలెం, దామావారిపాలెం, చిలకలూరిపేట, నరసరావుపేట, మద్దిపాడు, మేదరమెట్ల ప్రాంతల్లో బుల్లెట్లు, బెంగులూరులో స్కూటీని దొంగలించారు. వీటిలో కొన్ని వినియోగించుకుంటూ, మిగిలినవి అద్దంకిలోని బ్రహ్మానందం కాలనీలోని పాడుబడిన భవనంలో దాచిపెట్టారు. వరుస దొంగతనాలపై అద్దంకి టౌన్ సీఐ సుబ్బారాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలిస్తుండగా దొంగల ముఠాను అరెస్టు చేసి, 16 బుల్లెట్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ సుబ్బారావు, ఏఎస్ఐ వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, సిబ్బంది వి.బ్రహ్మయ్య, పి.బ్రహ్మయ్య, వెంకటగోపయ్యలను ఎస్పీ తుషార్‌డూడీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

అవీ..ఇవీ..

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనం నుంచే ఒక లక్ష్యంతో విద్యార్థులు ముందుకు పోవాలన్నారు. సోషల్ మీడియాను దరిచేరనీయవద్దని సూచించారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో అవసరమైన సాయం పొందాలని కోరారు. పరిచయంలేని వ్యక్తుల వాహనాలపై ప్రయాణం చేయవద్దని, కొత్తవ్యక్తులు ఇచ్చే పదార్థాలు దరిచేరనీయరాదని సూచించారు. హెచ్ఎం గిరిజ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో శక్తిటీం ఎస్ఐ హరిబాబు, సిబ్బంది సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : మత్తు పదార్థాలకు బానిసలై యువత జీవితాన్ని వృథా చేసుకోవద్దని పర్చూరు సబ్‌ఇన్‌స్పెక్టర్ జీవీ.చౌదరి అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం స్థానిక బిఎఆర్‌అండ్ టీపీ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. చెడు అవాట్లకు దూరంగా ఉండాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో పవన్ గోపీకృష్ణ ప్రతిభ


గోపీకృష్ణకు ప్రశంసాపత్రం అందిస్తున్న డైట్ సీనియర్ అధ్యాపకులు సర్దార్ పాపారాయుడు

పంగులూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మైనంపాడు డైట్ కళాశాల లో నిర్వహించిన వ్యాస రచన పోటీలో కొండ మంజులూరు విద్యార్థి పవన్ గోపీకృష్ణ ప్రతిభ చాటాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన పవన్ గోపీకృష్ణకు కళాశాల అధ్యాపకులు డాక్టర్ సర్దార్ పాపారాయుడు మంగళవారం ప్రశంసాపత్రం అందించి అభినందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వర్క్‌బుక్, నోట్‌బుక్‌లను పరిశీలించి ప్రగతిని అంచనావేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం అనిత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● అవస్థలు పడుతున్న బుర్లవారిపాలెం వాసులు


అధ్వానంగా ఉన్న బుర్లవారిపాలెం రహదారి

బుర్లవారిపాలెం (చీరాల), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొన్నిచోట్ల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బుర్లవారిపాలేనికి చెందిన ప్రజలు నిత్యం అన్నిరకాల పనుల నిత్యం చీరాల పట్టణానికి రావాల్సిందే. ఈక్రమంలో జాతీయ రహదారి నుంచి అంతర్గత ప్రధాన రహదారి గుంతలు పడి దారుణంగా ఉంది. ఆ పరిసరాల్లో విద్యుత్ సౌకర్యాలు కూడా లేవు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే నీళ్లతో నిండి మార్గం అగమ్య గోచరంగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారంచాలని ప్రజలు కోరుతున్నారు. రాకపోకలు సాగించేందుకు నానా యాతన పడుతున్నారు.

సీఆర్‌పీ మోషే కుటుంబానికి ఆర్థికసాయం


మోషే కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈవో

పంగులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్‌పీ మట్టకొయ్య మోషే కుటుంబానికి మండల ఉపాధ్యాయులు రూ.1.15 లక్షలు ఆర్థికసాయం చేశారు. మండలంలోని రేణంగివరం గ్రామా నికి చెందిన మట్టకొయ్య మోషే ఈ నెల 8న అర్ధరాత్రి సమయంలో వెంకటాపురం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం రేణంగివరంలో మోషే కుటుంబసభ్యులను పరామర్శించిన ఎంఈవో నాగభూషణం, మండల ఉపాధ్యాయులు తాము సేకరించిన నగదు మొత్తాన్ని భార్య నాగేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంకణాల శ్రీనివాసరావు, రహంతుల్లా, తన్నీరు వెంకటరావు, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రవిచంద్ర, బత్తుల సుబ్బారావు, పాలపర్తి ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

మార్టూరు, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించేందుకు , రైతులకు ఘన జీవామృతం, బీజామృతం తయారీపై డెమో కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఏపీ సీఎన్‌ఎఫ్ డీపీఎం హస్సేన్, అడిషనల్ డీపీఎం మోహన్ విచ్చేశారు. అనంతరం కోలలపూడిలో సర్పంచ్ ఎం. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఎన్‌పీఎం దుకాణాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ పడవల గణనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా కోత ఉంటుందన్నారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అధికారులకు మంత్రి రవికుమార్ ఆదేశం
తమ్మవరంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మేదరమెట్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా బర్లీ పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం కొరిశపాడు మండలంలోని తమ్మవరంలో ఏర్పాటు చేసిన బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతు బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు అధైర్య పడవద్దన్నారు. చివరి పొగాకును కొనుగోలు చేసి రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ప్రతి రోజు రైతుల నుంచి 500 చెక్కుల వరకు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పొగాకు కొనుగోలు సాగు చేసుకోవా లన్నారు. పొగాకు చెక్కులు కట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ ర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏవో రామ్‌మోహన్‌రెడ్డి, పలు గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : అర్హులైన పేదలం దరి కీ, సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సంత మాగులూరు మండలం, వెల్లలచెరువు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.30 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్స్‌ను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో బాల, బాలికలు దూర భారంతో చదువు మానివేయకుండా దశల వారీగా 10 వేల సైకిళ్లు అందిస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో ఇచ్చిన హామీ మేరకు వెల్లలచెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో 137 సైకిళ్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికి తిరుగుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.


పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న రవికుమార్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సజ్జా చంద్రమౌళి

ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, నిరంతర శ్రామికునిగా సజ్జా చంద్రమౌళి ప్రజల్లో అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మంగళవారం పట్టణంలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే ప్రజావైద్యులు డా.సజ్జా చంద్రమౌళి 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పట్టణంలోని గడియారస్తంభం కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రగడ కోటయ్య తరువాత చేనేత రంగానికి జీవం పోసిన మహోన్నత వ్యక్తి సజ్జా చంద్రమౌళి అని కొనియాడారు. చీరాలలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అరుదైన సేవలు అందించినట్లు వివరించారు. అంతేకాకుండా వృత్తిరీత్యా వైద్య రంగమైన ప్రవృత్తి రీత్యా రాజకీయారంగేట్రం చేసి వ్యక్తి గత జీవితాన్ని సైతం ప్రక్కన పెట్టి ప్రజాసేవకే అంకితమైనట్లు చెప్పారు. ఆయన అడుగు జాడ ల్లోనే వారి కుటుంబీకులు డా.సజ్జా రవీంద్ర, హ్యాండ్ లూ మ్ చైర్మన్ సజ్జా హేమలత ప్రజాసేవకై పాటుపడుతుండడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో చంద్రమౌళికి కో-ఆప్‌టెక్స్ చైర్మన్‌గా పదవి కల్పిస్తే, అదేవిధానంలో నేడు వారి కోడలు హేమలత మరో నామినేటెడ్ పదవిలో కొనసాగిస్తున్న ఘనత టీడీపీకే దక్కిందని చెప్పారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు టీడీపీ ప్రజలకు అండగా ఉండే పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు, చంద్రమౌళి అభిమానులు పాల్గొన్నారు.


చంద్రమౌళి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

● రోటరీ జిల్లా సహాయ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు


బాలికల పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని, విద్యతోపాటు క్రీడలను కూడా పోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రీటరీ జిల్లా సహాయ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పర్చూరులోని ఏఎన్‌వియస్ బాలికల ఉన్నత పాఠశాలకు నాగబౌరు శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో సమకూర్చిన రూ.15 వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసమైన మౌలిక వసతలు కల్పనలో రోటరీ కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కెయస్‌ఆర్‌కె ప్రసాద్, కోటా శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు యస్.అవని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోజుకు వెయ్యి పొగాకు బేళ్లు కొనుగోలు చేయాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్

పంగులూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని నల్లబర్లీ కొనుగోలు కేంద్రంలో రోజుకు కనీసం వెయ్యి పొగాకు బేళ్ల కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంగులూరులో మంగళవారం పొగాకు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నామ మాత్రపు కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. రైతులు తాము పండించిన పొగాకు అమ్ముకునేందుకు నెలల తరబడి ఎదురు చూస్తున్నారన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సందర్భంలో రోజుకు 300-500 బేళ్ల పొగాకు కొనుగోలు చేస్తామని హామీ యిచ్చారన్నారు. కొన్న మూడు రోజులలో డబ్బు చెల్లిస్తామని హామీ యిచ్చారని కృష్ణయ్య గుర్తు చేశారు. కానీ ఆచరణలో పరిస్థి తులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. రైతు లు ఐదు నెలలుగా తాము పండించిన పొగాకు మండెల రూపంలో నిల్వ ఉంచారని, ఆ పొగాకు ఈ పాటికే పనికి రాకుండా ఉండే దశకు చేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు సాంద్రత పెంచి త్వరితగతిన కొనుగోలు చేసి రైతును ఆదుకో వాలని కోరారు. రైతుసంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లా డుతూ ప్రభుత్వం, అధికారులు వ్యాపారంలా చూస్తున్నారని, రైతును ఆదుకునేలా భావిచడం లేదని విమర్శించారు. నాణ్యత పేరుతో పొగాకు బేళ్ళను వెనుకకు పంపడం సరైన విధానం కాదన్నారు. లోపాలను సవరించి ప్రభుత్వం వేగవంతంగా పొగాకు బేళ్ళను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, వినోద్‌బాబు, ప్రభాకర్,రాజయ్య, రమేష్, నతానియేల్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


ఇంకొల్లు పీహెచ్‌సీలో అందజేస్తున్న అక్సిజన్ కాన్సెంట్రేటర్లు

ఇంకొల్లు,జూలై 15,(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఆర్‌సీ) కార్యక్రమంలో భాగంగా మిడివెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ సంస్థ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు ఆక్సిజన్ కాన్సెంట్రేటర్లను ఉచితంగా అందజేయడం అభినందనీయమని ఇంకొల్లు ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డా.అంజలీ అన్నారు. బాపట్ల జిల్లాలోని పీహెచ్‌సీ ఏరియా వైద్యశాలకు 59 ఆక్సిజన్ కాన్సెంట్రేటర్లను మంగళవారం ఆ సంస్థ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు అందజేశారు. బాపట్ల, చీరాల, పర్చూరు పరిధిలోని పీహెచ్‌సీలకు 46 యూనిట్లు, సీహెచ్‌సీలకు 16 యూనిట్లు పంపిణీ చేశారు. వీటితో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చునని శ్రీనివాసరావు అన్నారు. దాతలను డా.అంజలి అంభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

మార్టూరు, జూలై15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల ప్రతిఫలాలు వేగంగా ప్రజలకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి సీహెచ్ విజయలక్ష్మి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బంగారు కుటుంబాలు, సూర్యఘర్ తదితర అంశాలకు సంబంధించి, మంగళవారం మార్టూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మార్టూరు, యద్దనపూడి, పర్చూరు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో పాటు వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులతో డీడీవో విజయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బంగారు కుటుంబాలు ఎంపికపై ఆయా మండలాల ఎంపీడీవోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్టూరు మండలంలో బంగారు కుటుంబాలకు 2200 కుటుంబాలను ఎంపికచేశామని, వారికి మార్గదర్శకులుగా 186 మందిని ఎంపికచేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా పర్చూరు, యద్దనపూడి మండలాల పరిస్థితిని కూడా ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక సూర్యఘర్ లో మండలాలలో ఎంతమంది నమోదు చేసుకున్నారు, ఇంకా ఎంతమంది నమోదు చేసుకోగలరనే విషయంపై ఆమె అధికారులతో మాట్లాడారు. మండలానికి 1500 లక్ష్యంగా చేసుకున్నామన్నారు. అందుకు సంబంధించి ప్రణాళికలను తయారుచేసి ఉన్నత అధికారులకు పంపించాలని వారిని కోరారు. కార్యక్రమంలో పలు మండలాల ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివిజన్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

ఇంకొల్లు,జూలై 15,(ఆంధ్రజ్యోతి) : పత్తి సాగు చేసే రైతులు విత్తనాలను శుద్ధి చేసుకొని నాటుకుంటే పత్తిలో వచ్చే ఎండుతెగులు నివారించుకోవచ్చని ఏవో మీరమ్మ తెలిపారు. మండలంలోని పావులూరులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక కిలో పత్తి విత్తనాలకు 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, 5 గ్రాములు సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేయాలన్నారు. ప్రతి పంటపై బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పావులూరు సర్పంచ్ లుదియమ్మ, వ్యవసాయశాఖ సిబ్బంది వినయ్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పడవల గణనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ ఉదయం 5గంటలకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

స్వల్ప వివాదం నేపథ్యంలో కత్తులతో దాడి

చీరాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప వివాదం నేపథ్యంలో ఇరువురు వ్యక్తులు కత్తులతో దాడి చేసుకున్న ఘటన పట్టణంలోని ముంతావారి కూడలిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే స్థానిక వైకుంఠపురం జాలమ్మగుడి సమీపంలోని కావాటి కృష్ణవేణి, మరో ఇద్దరు మహిళలతో ఆటోలో పట్టణంలోని ఓ బ్యాంకుకు వెళుతుంది. అదే సమయంలో గంజిపాలెంకు చెందిన సుబ్రహ్మణ్యం మరొక వ్యక్తితో స్కూటీపై వెళుతుండగా ఇరువురు వాహ ఔ నాలు ముంతావారి సెంటర్ వద్ద స్వల్పంగా ఢీకొన్నాయి. అనంతరం ఈ వివాదం తారాస్థాయికి చేరింది. సుబ్రహ్మణ్యం మరో ఇద్దరు వ్యక్తులను ఘటనా స్థలానికి పిలిపించాడు. దీంతో ఘర్షణలకు దిగడంతో కృష్ణవేణి వీపు, ఎడమ కంటిపై సుబ్రహ్మణ్యం సహచరులు కత్తితో దాడి చేశాడు. కృష్ణవేణి, ఆటోలో వారు సుబ్రహ్మణ్యంపై కత్తితో దాడి చేశారు. ఇరువురు రక్త గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతుండగా, సిఐ సుబ్బారావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే రెండు వర్గాలకు సంబంధించి గతంలో ఎటువంటి వివాదాలు లేకపోగా, ఇరువురు పాతనేర చరిత్ర కలిగిన వారు కావడం విశేషం.


వివరాలు సేకరిస్తున్న సీఐ సుబ్బారావు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యద్దనపూడి,(మార్టూరు)జూలై15(ఆంధ్రజ్యోతి):జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో సూరవరపుపల్లి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మంగళవారం స్టేషన్‌కు సమాచారం అందినట్లు ఎస్ఐ టి రత్నకుమారి తెలిపారు. మృతునికి 35 నుండి 40 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు.మృతుని శరీరంపై క్రీమ్ కలర్ షర్ట్,ప్యాంట్ ఉన్నద న్నారు.అంతకు మించి మృతుని నుండి ఎలాంటి సమాచారం లభించలేదన్నారు.రోడ్డుపై వెళ్లే ఏదైనా వాహనం నుంచి మృతుడు రోడ్డుపై పడి ప్రాణాలు పోగొట్టుకున్నాడా లేదా అని పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని గురించి సమాచారం తెలిసిన వారు స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.

మద్దతు.. మమ

● దిగుబడులు కొండంత ● మార్క్‌ఫెడ్ సేకరించింది గోరంత
● బహిరంగ మార్కెట్ వైపే రైతుల మొగ్గు
● మొక్కుబడిన్న కొనుగోళ్ల ఊసేలేదు

వచ్చాయి. ఈ పంట మార్క్‌ఫెడ్ జాబితాలో ఉంది కూడా. కానీ మద్దతుధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో మొత్తం దిగుబడులను రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వచ్చింది

వైఫల్యాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం

పంటల సేకరణ మరీ ఇంతలా తీసికట్టుగా ఉండడానికి అనేక బాలారిష్టాలు కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా దిగుబడులు అన్నదతాల చేతికొచ్చిన మూడు వారాల తర్వాత గానీ మార్క్‌ఫెడ్ కేంద్రాలు తెరవలేదు. దీనికి తోడు మార్క్‌ఫెడ్ వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చడంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల ఊసే దాదాపుగా మరిచారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం వైఫల్యం కూడా కారణంగా నిలిచింది. నిబంధనల చట్రం కూడా సేకరణకు ప్రతిబంధకంగా మారింది.

బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువ....ఉత్తమాటే...

బహిరంగ మార్కెట్‌లో ఆయా పంటల ధరలు మద్దతు ధరకు కన్నా ఎక్కువగా ఉండడం వల్లనే సేకరణ తక్కువగా ఉందనే వాదనను యంత్రాంగం చేస్తోంది. కానీ దిగుబడుల సమయంలో క్షేత్రస్థాయిలో ఉన్న ధరలను గమనించినట్లయితే ప్రతి పంట రేటు కూడా మద్దతుధర కన్నా బహిరంగ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.800 వరకు తక్కువగానే ఉంది.

నగదు జమ విషయంలోనూ జాప్యమే

పంటల కొనుగోళ్లకు సంబంధించిన నగదును 48 గంటల్లోనే జమ చేస్తామనే పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. మార్క్‌ఫెడ్ సేకరణ జరిపిన పంటల విషయంలో కూడా కనీసం నాలుగు వారాలు మొదలుకుని నెలన్నర వరకు సమయం డబ్బులు జమ కావడానికి పట్టినట్లు సమాచారం.

త్రిమెన్‌కమిటీ చైర్మన్ల ఎంపిక

పర్చూరు జూలై15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో త్రిమెన్‌కమిటీల ఎంపిక పూర్తయ్యింది. బొల్లాపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొట్టిపాటి నరసింహారావు, డైరెక్టర్లగా తాటి ఆంజనేయలు, ఇందుర్తి ఖాజారావు. ద్రోణాదులకు ముప్పరాజు ఆంజనేయులు, డైరెక్టర్లగా గంజి వీరాంజనేయులు, గోగుమళ్ళ జేమ్స్, రమణాయపాలెంకు చైర్మన్‌గా పాలేటి కోటేశ్వరరావు, కోలా సాంబయ్య, షేక్.అబూబాకర్, అమ్మినేని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లగా సూరిశెట్టి అంకమ్మరాజు, పసుపులేటి రవిచంద్రబాబు, భీమవరానికి రాయపాటి వెంకటరావు, డైరెక్టర్లగా మందాలపు శేషయ్య, చలిచం గోపాలస్వామి, ఇంకొల్లు పీఏసీయస్‌కు కరి శ్రీనివాసరావు, డైరెక్టర్లగా గోరంట్ల నాగేశ్వరావు, మన్నెం ఏసుబాబు, కొణికి బోడెంపూడి సుబ్బారావు, డైరెక్టర్లుగా కంచనపల్లి సుబ్బారావు, పావులూరి రామారావు, పావులూరుకు నారిశెట్టి రాంబాబు, డైరెక్టర్లగా గంజి నాగేశ్వరావు, కామేపల్లి తాతారావు, సంతరావూరు చైర్మన్‌గా యార్లగడ్డ లక్ష్మీ, డైరెక్టర్లగా మైలా ప్రసాద్, బండారు అంజనేయులు, ఆదిపూడి పీఏసీయస్ చైర్మన్‌గా దండా శ్రీనివాసరావు, డైరెక్టర్లగా నాయుడువారిపాలెం చైర్మన్‌గా జరుగుల శ్రీనివాసరావు, డైరెక్టర్లగా పోతిన వెంకటనారాయణ, పేర్ని చెంచయ్య, అన్నంబొట్లవారిపాలెం చైర్మన్ అప్పలనేని నరేంద్రబాబు, బోడవాడ త్రేలప్రోలు శ్రీనివాసరావు, నాగులపాలెం అడ్డగడ్డ సుబ్బారాయుడు, నూతలపాడు విన్నకోట సతీష్, పర్చూరు కొల్లా చంద్రం, పోతుకట్ల ఎర్రావాసుబాబు నియమితులయ్యారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మార్టూరు,జూలై15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సరిమెళ్ల దయాకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఆయన వద్ద ఉన్న ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని,కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

రేసులో.. ఆ ఇద్దరు!

● చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడే

(3వ పేజీ తరువాయి...)

మీద నడకగానే ఉండనుంది

అంతా సవ్యంగానే కనిపించినా...

చీరాల రాజకీయం అంచనాలకు అందదనే సంఘటనలు గతంలోనే పలు మార్లు నిరూపితమైంది. తాజాగా చైర్మన్ అవిశ్వాస ఘట్టం కూడా ఎన్నో మలుపులు తీసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీడీపీకి మద్దతుగా ఉన్న 21 మంది కౌన్సిలర్లలో ఒక్కరు తప్ప అందరూ నిన్న మొన్నటి వరకు వైసీపీ గూటి పక్షులే. ఇప్పటికీ 7 గురు కౌన్సిలర్లు వైసీపీలోనే ఉండగా, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా 5గురు కౌన్సిలర్లు కొనసాగుతున్నారు. జరుగుతున్న పరిణామాలను వీరు నిశితంగా గమనిస్తున్నారు. నేటి చైర్మన్ ఎన్నిక అంకంలో వీరిలో ఎవరైనా పోటీకి ముందుకు వస్తే ఎన్నిక అనివార్యమే. కాకుంటే సంఖ్యాబలంగా టీడీపీకి స్పష్టమైన మెజారిటీ కనిపిస్తుండడంతో ఎన్నిక జరిగినా పీఠం టీడీపీదేననే ధీమాను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.



శక్తియాప్‌తో మహిళలకు రక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ

మేదరమెట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్ స్కూల్‌లో నిర్వహించిన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శక్తియాప్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. అనుమానిత వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కొరిశపాడు, మేదరమెట్ల ఎస్ఐలు ఎస్ఐలు హరిబాబు, మహమ్మద్ రఫీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

24 మందికి వినికిడి మిషన్ల అందజేత


వినికిడి మిషన్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్

అద్దంకిటౌన్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు భవిత కేంద్రం ఒక వరం అని డిప్యూటీ డిఈవో డి.గంగాధరరావు అన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ద్వారా అందించిన 24 వినికిడి మిషన్లను డిప్యూటీ డీఈవో గంగాధరరావు, ఎంఈవో -2 అనంత శ్రీనివాస రావుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతు 2025-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రూ.5 లక్షల విలువైన ఉపకరణాలను ఉచితంగా అందజేసిందన్నారు. ఉపకరణాలు అందుకున్న విద్యార్థులు చక్కగా చదువుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్‌టి ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, చైతన్య బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ఉపాధ్యాయులు బాబురావు, ధనలక్ష్మి, విజయకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అద్దంకిలోని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న శిబిరంలో, రోడ్లు వెంబడి బిక్షాటన చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ఈ సమ్మెకు సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఇతర సంఘాల నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, తొట వెంకటేశ్వర్లు, టి. రాజు, నాగేశ్వరరావు, మీరావలిలు సంఘీబావం తెలిపారు.











ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025



నేడు విజిలెన్స్, మానిటరింగ్
కమిటీ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జూలై 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరుగుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఇప్పుడు వద్దులే బా!



వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల వ్యవస్థ జిల్లాలో నిర్వీర్యమైపోతోంది. గత ప్రభుత్వంలో కమిటీలను నియమించకపోవడం, ఇంజనీర్లకు ప్రత్యేకాధికారుల బాధ్యతలు అప్పగించడంతో వ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఒక పద్ధతి, విధానం అంటూ లేకుండా సంఘాల నిర్వహణ జరగడంతో ఆ ప్రభావం కొత్తగా ఎన్నికైన వారిపై పడుతోంది. గతేడాది డిసెంబరులో సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తయినా నేటికీ సగానికిపైగా కొత్త కమిటీలు బాధ్యతలు తీసుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం జీఎస్టీ నోటీసులు అందుతుండటమే. గతంలో చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించినా.. పాత అధ్యక్షులు, ప్రత్యేకాధికారులు జీఎస్టీలు కట్టలేదు. ఇప్పుడు ఆ బకాయిలు చెల్లించాలంటూ వరుసపెట్టి నోటీసులు అందుతున్నాయి. దీంతో కొత్త కమిటీలు హడలిపోతున్నాయి. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ తాము బాధ్యతలు తీసుకోలేమంటూ తేల్చి చెబుతున్నారు. ఈ కమిటీలన్నీ ఇంకా స్పెషలాఫీసర్ల పాలనలోనే కొనసాగుతున్నాయి.

- వరుసబెట్టి జీఎస్టీ నోటీసులు అందుతుండటమే కారణం
- గత కమిటీలు, ఇంజనీర్ల నిర్వాకంతోనే..
- సాగునీటి సంఘాల సభ్యుల తీరిది!
- ఏడు నెలలైనా బాధ్యతలు తీసుకోని కమిటీలు

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 6 ప్రాజెక్టు కమిటీలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 486 డబ్ల్యూఏ (సాగునీటి సంఘాలు) ఉన్నాయి. గడిచిన ఆరేళ్లుగా ఈ కమిటీలు, సాగునీటి సంఘాలకు ఎన్నికలు లేవు. వైసీపీ అధికారంలోకి రాగానే 2019లో అప్పటివరకూ ఉన్న సాగునీటి సంఘాల కమిటీలను రద్దు చేసింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించలేదు. ప్రాజెక్టు కమిటీలకు ఇరిగేషన్ ఎస్ఈలను, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఈఈలను, డబ్ల్యూఏలకు ఆయా డీఈఈలను స్పెషలాఫీసర్లుగా నియమించింది. వీరి ఆధ్వర్యంలోనే ఐదేళ్లపాటు నీటి సంఘాల పాలన సాగింది. క్షేత్రస్థాయిలో కాలువపై ఏదైనా సమస్య తలెత్తితే రైతులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక నానా అవస్థలు పడేవారు. రైతుల అవసరాలను, క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. గతేడాది సాగునీటి సంఘాల ఎన్నికలకు పూనుకుంది. ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, డబ్ల్యూఏలు అన్నింటికీ ఎన్నికలు నిర్వహించింది. డిసెంబరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కొత్తగా ఎన్నికైన వారికి బాధ్యతలు అప్పగించాలని స్పెషలాఫీసర్లను ఆదేశించింది. అలానే ఈ కమిటీలకు ఇప్పటివరకూ రూ.5 లక్షలలోపు పనులు మాత్రమే నామినేషన్ కింద చేసేందుకు అవకాశముండగా, ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచింది.

● మెమోల జారీ

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఎన్నికలు నిర్వహించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కో కమిటీ కాలపరిమితి రెండేళ్లు మాత్రమే. అంటే ఇప్పటికే ఏడు నెలలు గడిచిపోయాయి. మరి జీఎస్టీ సమస్యలు పరిష్కారమయ్యేదెప్పుడు? సాగునీటి సంఘాల కొత్త కమిటీలు బాధ్యతలు తీసుకునేదెప్పుడు..? అన్నది చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను సంప్రదించగా.. కొన్ని కమిటీలు ఇంకా బాధ్యతలు తీసుకోలేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. వెంటనే కొత్త కమిటీలకు బాధ్యతలు అప్పగించాలని సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

● రూ. కోట్ల జీఎస్టీ ఎగనామం

2019 వరకూ సాగునీటి సంఘాల పేర్లపై రూ.వందల కోట్ల పనులు జరిగాయి. ఎక్కువగా నీరు-చెట్టు పనులే ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేసి బిల్లులు తీసుకున్నాక నీటి సంఘాల అధ్యక్షులు నిర్దేశించిన జీఎస్టీ మొత్తాన్ని కట్టాల్సి ఉంటుంది. అయితే చాలా మంది జీఎస్టీలు కట్టలేదు. ఆ తర్వాత వచ్చిన స్పెషలాఫీసర్లు కూడా ఇదే దారిలో నడిచారు. నీరు-చెట్టు బిల్లులు రాకపోవడంతో నీటి సంఘాల అధ్యక్షులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత బిల్లులు పడ్డాయి. ఇటీవల కూడా ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులన్నింటినీ విడుదల చేసింది. ఇందులో నుంచి జీఎస్టీను పట్టుకొని మిగిలిన డబ్బులను పాత కమిటీ అధ్యక్షులకు ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకుండా జీఎస్టీ మొత్తాలను కూడా లాగేశారు. అయితే కొన్ని సంఘాల ఖాతాల్లో మాత్రం జీఎస్టీ డబ్బులు అలానే ఉన్నాయి. చట్ట ప్రకారం స్పెషలాఫీసర్లు ఎప్పటికప్పుడు జీఎస్టీ బకాయిలను క్లియర్ చేసుకుంటూ రావాల్సి ఉండగా అలా చేయలేదు. దీంతో ఇప్పుడు ఆయా సంఘాలకు నోటీసుల మీద నోటీసులు అందుతున్నాయి. ఒక సంఘానికి రూ.5 లక్షలు కట్టాలని వస్తే, మరో సంఘానికి రూ.25 లక్షల వరకూ బకాయి ఉన్నారంటూ నోటీసులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు, కమిటీ సభ్యులు బాధ్యతలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు.



యూరియా కోసం పడిగాపులు



ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ కార్యాలయంలో కౌంటర్ వద్ద రైతులు

యూరియా కొరత వెంటాడుతుండటంతో రైతుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ నెలలో ఇప్పటి వరకు 67 మెట్రిక్ టన్నులు ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీకి సరఫరా అయ్యాయి. రైతులకు ఆధార్ కార్డుపై ఒక్కొక్కరికి నాలుగైదు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. ఇవి ఒక ఎకరాకుకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు, చేజర్ల మండలాల రైతులు ప్రతిరోజు ఆత్మకూరుకు యూరియా కోసం వచ్చిపోతున్నారు. బయట మార్కెట్‌లో బస్తా యూరియా కావాలంటే రూ.360లకు కనుగోలు చేయాలి. దీంతోపాటు ఒక పొస్పేట్ కట్ట కొంటేనే యూరియా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం సరఫరా చేసే కేంద్రాల్లో యూరియా బస్తా రూ.270లకు లభిస్తోంది. ఈ క్రమంలో ఆత్మకూరు సొసైటీకి మంగళవారం 36 టన్నులు (800 బస్తాలు) యూరియా వచ్చింది. ఇది తెలుసుకున్న రైతులు యూరియా కోసం రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

సోమశిల జలాశయానికి 2800 క్యూసెక్కుల కృష్ణాజలాలు

● డెల్టాకు నీటి కొరత రానీయం : ఎస్ఈ

సంగం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి కృష్ణానది నుంచి సుమారు 2800 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోందని ఆ జలాశయ ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డితో కలిసి కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ వినయ్ కుమార్‌ను అడిగి కాలువలకు విడుదల చేస్తున్న నీటి వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఈ మాట్లాడుతూ డెల్టాలో సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు సాగు నీరు పుష్కలంగా ఉందన్నారు. దీనికితోడు కృష్ణా జలాలు సోమశిల జలాశయానికి రావడం ప్రారంభమయిందని, రోజుకు సుమారు 2800 క్యూసెక్కుల ప్రవాహం వస్తుందన్నారు. ప్రస్తుతం డ్యాం నుంచి డెల్టాకు 3600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఇందులో కనిగిరి రిజర్వాయర్‌కు 1260, కావలి (బెజవాడ పాపిరెడ్డి) కాలువకు 800 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు రాకుండా అవసరమైతే నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య, ఏఈ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● 'సోమశిల'లో 28 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 2,793 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 28.200 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



కనిగిరి ప్రధాన కాలువ క్రాస్ రెగ్యులేటర్లను పరిశీలిస్తున్న సోమశిల జలాశయం ఎస్ఈ రమణారెడ్డి



శ్రీకృష్ణధర్మ రాజుస్వామి ఆలయంలో దర్బార్ అలంకారం

యుధిష్టర పట్టాభిషేకం



ధ్వజావరోహణం గావిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మ రాజస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి యుధిష్టర పట్టాభిషేకం (దర్బార్ అలంకారం) కనుల పండువగా జరిగింది. మహాభారత ఘట్టాల ఆధారంగా 22 రోజుల నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు పట్టాభిషేక అలంకరణతో ముగిశాయి. చివరి రోజు ఉదయం విశేష పూజలు, చప్పర ఉత్సవం, అన్నదానం జరిగాయి. సాయంత్రం ధ్వజావరోహణం, విశేష పూజలు, నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో జానకి పర్యవేక్షించారు.

19, 20 తేదీల్లో వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేయను న్నట్లు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గమాటి శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేయనున్నట్లు తెలిపారు. సాధారణంగా విజయవాడలోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగే ఈ రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ ఈసారి నెల్లూరు జిల్లా వైద్యులకు ప్రభుత్వ వైద్య కళాశాలలోనే నిర్వహిం చాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి అనుగు ణంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. దేశంలో మొట్టమొదటి సారిగా వైద్యుల వద్దకే మెడికల్ కౌన్సిల్ వచ్చి సేవలు అందిస్తోందని తెలిపారు.

అబ్బా.. ఏమి ఎండ!



ఉదయగిరి : ఎండదెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న ఉదయగిరి బస్టాండ్

వేసవిని తలపించేలా భగ్గుమంటున్న భానుడు

జూలైలోనూ మే నెలను తలపించేలా భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 7 గంటలకే సూర్యుడు సుర్రు మంటున్నాడు. మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు 37, 38, 39 డిగ్రీలు నమోదవుతున్నాయి. వర్షాలు కురిసి, వాతావరణం చల్లగా ఉండాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో భరించలేని వేడి పుడుతోంది. ఉత్తరాదిన వర్షాలు కురుస్తూ వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇందుకు భిన్నంగా జిల్లాలో సెకండ్ సమ్మర్ వచ్చిందా అన్న రీతిలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లు మధ్యాహ్నానికల్లా బోసిపోతున్నాయి. ఎండవేడిమి భరించలేక పిల్లలు, వృద్ధులు, దినసరి కూలీలు అవస్థలు పడుతున్నారు. పడమటి గాలులు వీస్తుండటం, ఆశించిన మేర వర్షాలు కురకపోవడం, భూమి చల్లదనం కాకపోవడంతో ప్రజలు వేడిగాలులతో అల్లాడుతున్నారు.

- నెల్లూరు (వైద్యం)/ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ఏపీపీఎస్సీ పరీక్షలు
తొలిరోజు ప్రశాంతం


నెల్లూరు (హరనాథపురం), జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు కేంద్రాలలో ఏపీపీఎస్సీ లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి జరిగిన పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెం వద్ద అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తనిఖీ నిర్వహించారు. ఈ నెల 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

మామూళ్లు ఇస్తున్నాం...
ఇక అడ్డేముంది!

- బరి తెగిస్తున్న రేషన్ మాఫియా
- అక్రమాలపై కాలు కదపని అధికారులు
- అల్లీపురంలో 20 టన్నుల బియ్యం సీజ్
- వారం రోజులైనా బయటకు రాని విషయం

జిల్లాలో రేషన్ మాఫియా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల సహకారం పుష్కలంగా ఉండటంతో అక్రమార్కులు తగ్గేదేలా అంటున్నారు. ఎవరెన్ని ఫిర్యాదులు చేసుకున్నా.. నిఘా వర్గాలు నివేదికలు అందజేసినా తమకేమీ కాదంటూ బహిరంగంగానే చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. 'కింది నుంచి పై వరకూ అందరికీ మామూళ్లు ఇస్తున్నాం.. ఆఖరుకు రేషన్ బియ్యంపై ఎన్‌ఫోర్స్ చేసే ప్రతి శాఖకు నెల మామూళ్లు కడుతున్నాం.. ఇక తమకు అడ్డేముంది'అంటూ మాఫియా మాట్లాడుతోందని పౌరసరఫరాల శాఖలో విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మాఫియా బహిరంగంగానే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నా అధికారుల నుంచి కనీస స్పందన ఉండటం లేదు. ప్రతి నెలా 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తారు. ఈలోపు ఆ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే బియ్యం నిల్వలో ఎంత తేడా ఉందో అర్థమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలానే మిల్లులలో తరచూ తనిఖీలు చేస్తుంటే చాలా వరకూ మాఫియాను కట్టడి చేసేందుకు అవకాశం కలుగుతుంది. కానీ గతంలో మాదిరి ఇప్పుడు ఏ ప్రభుత్వ శాఖ కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణాను సీరియస్‌గా తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వారం రోజుల క్రితం అల్లీపురంలో ఓ మిల్లులో 20 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే ఇప్పటికీ ఈ విషయం బయటకు రాకపోవడం గమనార్హం. సాధారణంగా ఒక అక్రమ వ్యవహారాన్ని బట్టబయలు చేసినప్పుడు అధికారులు ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. మరొకరికి ఇదొక హెచ్చరికగా ఉంటుందన్నది అధికారుల భావన. కానీ ఇక్కడ మాత్రం అలా జరగలేదు. కాగా ఇలా సీజ్ చేసిన బియ్యాన్ని కొత్తూరు వద్దనున్న ఎంఎల్ఎస్ పాయింట్‌కు అదే రోజు అర్ధరాత్రి తరలించారు. సాధారణంగా ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న హమాలీలే ఏ లోడ్ వచ్చిన బస్తాలు దించుతుంటారు. కానీ అల్లీపురం నుంచి తెచ్చిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ గోదాములో పెట్టేందుకు బయటి వ్యక్తులను పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక హమాలీలు టీడీపీ నాయకులను తీసుకొచ్చి అన్‌లోడింగ్‌ను అడ్డుకున్నారు. ఎందుకు బయట వ్యక్తులను తీసుకొచ్చారంటే ఏ అధికారి నుంచీ సమాధానం రాలేదు. ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన బస్తాల్లో చాలా వరకూ నూకలు ఉన్నట్లు టీడీపీ నాయకులు, హమాలీలు గుర్తించారు. మరి నూకలు ఎక్కడి నుంచి వచ్చాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే అల్లీపురం మిల్లులో బియ్యం సీజ్ చేసిన రోజునే రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.. జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరి మంత్రి సమీక్ష నేపథ్యంలోనే ఆ రోజు ఒక మిల్లులో దాడి చేసి ఆ తర్వాత మిన్నకుండిపోయారా..? అన్న ప్రచారం కూడా జరుగుతోంది.



అల్లీపురంలోని ఓ మిల్లులో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

చెక్‌పోస్టు పెట్టాం

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు వెంకటాచలం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. ఇప్పటికైతే మా సిబ్బందే అక్కడ పని చేస్తున్నారు. పోలీసు సిబ్బందిని కూడా అడిగి ఉన్నాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతోంది.

- విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

వడ్డీ కాదు..
మొత్తం కట్టాల్సిందే!

- పంట, బంగారు రుణాల రీషెడ్యూల్‌లో మెలిక
- అసలు, వడ్డీ కట్టాల్సిందేనని బ్యాంకర్ల షరతు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ప్రజలు

దుత్తలూరు మండలానికి సుబ్బారెడ్డి గతేడాది తనకున్న పొలంలో శనగ సాగు చేసేందుకు రూ.2 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఈ ఏడాది దిగుబడి తగ్గడంతోపాటు మద్దతు ధర లేకపోవడంతో నష్టాలను చవిచూశాడు. తీసుకున్న పంట రుణాన్ని వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకొందామని బ్యాంకుకు వెళ్లగా అసలు, వడ్డీ మొత్తం కడితేనే రెన్యువల్ చేస్తామని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో సుబ్బారెడ్డి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

ఉదయగిరి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు గతేడాది తన కుమారుడి చదువు కోసం బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి రూ.2.50 లక్షల రుణం తీసుకున్నాడు. సమయానికి నగదు దొరక్కపోవడంతో బ్యాంకుకు వెళ్లి వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకొందామని వెళ్లగా అధికారులు ఒప్పుకోలేదు. దీంతో చేసేదేమీ లేక వడ్డీ వ్యాపారుడి వద్దకు వెళ్లి రూ.లక్షకు రోజుకు రూ.5 వేలు చొప్పున రూ.2.5 లక్షలు తీసుకుని బ్యాం కురు చెల్లించాడు. తిరిగి ఆ నగదు ఆ బ్యాంకులో పెట్టి వడ్డీ వ్యాపారికి చెల్లించాడు.

ఉదయగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గోరుచుట్టుపై రోకటిపోటులా దిగుబడులు లేక.. మద్దతు ధర పలకక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన తమను బ్యాంకర్లు ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. సాగు కోసం తీసుకున్న రుణాలను వడ్డీ సహా అసలు చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని చెబుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నగదు అత్యవసరమై బ్యాంకుల్లో బంగారం కుదవపెట్టిన ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొన్ని బ్యాంకులు వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలను రెన్యువల్ చేస్తుండగా, కొంతమంది బ్యాంకర్లు మాత్రం అసలు, వడ్డీ కడితేనే రెన్యువల్ చేస్తామని తేల్చి చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక రుణ గ్రస్థులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

● భారీగా తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడులు లేకపోవడం, అరకొరగా వచ్చిన దిగుబడులకూ మద్దతు ధర పలకకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా వరి, పసుపు, శనగ, పొగాకు, మిర్చి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, మినుము, కంది తదితర పంటలు సాగు చేస్తారు. ఈసారి ప్రకృతి వైపరీత్యాల తీవ్ర ప్రభావం దిగుబడులపై చూపడంతో రైతులు నష్టాలు చవిచూశారు. దీంతో పంటల సాగుకు బ్యాంకుల నుంచి పలువురు రైతులు రుణం తెచ్చుకొన్నారు. ఇలాంటి సమయంలో బ్యాంకర్లు అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే రుణాలు రీ షెడ్యూల్ చేస్తామని చెప్పడంతో వారు ఆవేదనలో పడ్డారు.

● వడ్డీ వ్యాపారుల హవా

ఆశాజనకంగా దిగుబడులు లేకపోవడంతో రైతులు, సమయానికి నగదు అందక ప్రజలు వడ్డీ కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో అసలు చెల్లించాలని బ్యాంకులు చెబుతుండటంతో మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో కొందరు చేసేదేమీలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు రూ.లక్షకు రోజువారీగా రూ.2 వేల నుంచి 5 వేలు, వారానికి రూ.10 వేల నుంచి 20 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వడ్డీ చెల్లిస్తే రుణాలు రెన్యువల్ చేసేలా చర్యలు చేపట్టాలని రుణగ్రస్థులు కోరుతున్నారు.



చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515


క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం పీజీ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న పేద మహిళ కృష్ణవేణి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ వారు ఆమెకు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు టీవీ శేషయ్య, సభ్యులు మంద వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, సుంకు కృష్ణ, క్లాత్ శ్రీను, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, బుజ్జి, గోపాల్, వెంకయ్య, కోటి పాల్గొన్నారు.



ఆ ఇళ్లకు మోక్షం లేదా?

- లబ్ధిదారుల్లో కొరవడిన ఆసక్తి
- జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు
- జాడలేని అవినీతి విచారణ నివేదిక
- అంతుపట్టని కూటమి ప్రభుత్వ ఆలోచన



శ్లాబ్ లెవెల్ వరకు జరిగిన నిర్మాణాలు

కావలి(టౌన్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కావలిలో గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ రాష్ట్రంలోనే అతి పెద్దదిగా గొప్పలు చెప్పుకోగా అక్కడ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. దీంతో ఈ ఇళ్లకు ఇక మోక్షం లేదా అన్న చర్చ జరుగుతోంది. ఈ ఇళ్లపై లబ్ధిదారుల్లో సైతం ఆసక్తి కరువైంది. ఈ లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని ప్రచారం జరగగా సంబంధిత, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఆ నివేదిక ఏమైందో కూడా తెలియని పరిస్థితి. దీంతో అసలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆలోచనా విధానం ఏమిటన్నది అంతుపట్టడం లేదని స్థానికులు బహిరంగంగా చెప్పుకొంటున్నారు. కావలి ముసునూరులోని మెగా జగనన్న లేఅవుట్ స్థల సమీకరణ నుంచి లబ్ధిదారుల ఎంపిక, గృహాల నిర్మాణం వరకు అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. నిర్మాణ బాధ్యతలు వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లకే అప్పజెప్పడం, వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించి నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతో గృహ ప్రవేశాలకు ముందే నిర్మాణ దశలోని అనేక గృహాలు చిన్నపాటి వర్షానికి, గాలికి కూలిపోయాయి. దీంతో లబ్ధిదారులు భయాందోళనలకు గురయ్యారు. ఒకవేళ ఈ ఇళ్లలో నివాసం ఉంటే ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ఏ అర్ధరాత్రో ఇళ్లు కూలి ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని భావించారు. దీంతో ఎలాగైనా ఎన్నికలకు ముందు గృహ ప్రవేశాలు చేయించి మైలేజ్ పొందాలన్న వైసీపీ ఆశలు అడియాశలయ్యాయి. దీంతోపాటు జగనన్న గృహాల అవినీతి గుప్పుమనడం, నాసిరకం నిర్మాణాల విషయం బయటపడడం, ఎక్కడి నిర్మాణాలు అక్కడే అసంపూర్తిగా ఆగిపోవడంతో లబ్ధిదారులకు ఆసక్తి లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న గృహాల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం, విచారణ బృందం విచారణ జరిపినా నివేదికలు కార్యరూపం దాల్చకపోవడం, అవినీతిపై చర్యలు చేపట్టకపోవడం అంతుపట్టని విషయంగా మారింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన జగనన్న గృహాల ప్రక్రియ అడుగడునా అవినీతికి కేరాఫ్‌గా మారింది. ముసునూరు వద్ద దాదాపు 110 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి 8,970 ఇళ్లను మంజూరు చేశారు. స్థలంలో గుంతలు, బొంతరాయి కొండను చదును చేసేందుకు రూ.21.78 లక్షలు మంజూరు చేయగా అప్పట్లో లేఅవుట్‌లోని విలువైన గ్రావెల్‌ను వైసీపీ నాయకులు రియల్టర్లకు అమ్ముకున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. నీటి వసతి కోసం వేసిన బోర్లు కూడా విఫలమవ్వడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. తాగునీటి వసతి కోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించుకుని అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో చేసేదిలేక వైసీపీ నేతలే కాంట్రాక్టర్లుగా మారి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. నిర్మాణంలో నాసిరకం వస్తువులు ఉపయోగించడం, నిర్మాణ దశలోనే అనేక నిర్మాణాలు కూలిపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు అటువైపు రావడం మానుకున్నారు. మంజూరైన 8,970 గృహాల్లో పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగినవి వందలోపే ఉంటాయి. వేలాది ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి.



పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

● కొరవడిన ఆసక్తి

జగనన్న గృహాలకు కేవలం 6 అంకణాలు స్థలం మంజూరు చేయడం, లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమవడం, వైసీపీ కాంట్రాక్టర్లు నిర్మాణ బాధ్యతలు చేపట్టి నాసిరకం నిర్మాణాలు చేపట్టడం తదితర కారణాలతో లబ్ధిదారులు గృహాలపై ఆసక్తి చూపడం లేదు.

● అంతుపట్టని ప్రభుత్వ ఆలోచన

జగనన్న గృహాల్లో అడుగడుగునా అవినీతి జరిగిందని, 6 అంకణాల స్థలంలో ఇళ్లు ఎలా నిర్మిస్తారని, ఎలా కాపురం చేస్తారని అప్పట్లో ప్రతిపక్షంలో కూటమి నేతలు పెద్దఎత్తున నినదించారు. ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం ఏర్పడి 13నెలలు పూర్తయినప్పటికీ జగనన్న గృహాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రభుత్వ ఆలోచన అంతుపట్టక లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు.



గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

● శ్రీనివాసులురెడ్డి, ఏఈ

కావలిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని, ఇందుకు ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి పూర్తి సహకారం అందించారు. ఈ క్రమంలో అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కావలి రూరల్ ఏఈ చేజర్ల శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు.

ఈ ఇంటర్వ్యూ

? మండలంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల మార్పునకు చర్యలు తీకున్నారా.

! ఇప్పటికే మండలంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసున్నాం.

? ముసునూరు ఇందిరమ్మ, తదితర కాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎలా పరిష్కరిస్తారు.

! నూతనంగా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు లాగుతాం.

? సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. ఉన్న సిబ్బందితో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నాం.

? రైతులకు కొత్తగా ఎన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.

! కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలోని గ్రామాల్లో 500 పైన విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేశాం.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ముందుకు సాగుదాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ అధ్యక్షతన నిర్వహించిన విజన్-2047 సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలను వివరించారు. ప్రతిగ్రామానికి తాగునీరు, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్, యువతకు ఉపాధి అవకాశాలు, పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, ట్యాబ్‌లు, క్రీడా పరికరాలు, గ్రామీణ ప్రాంతాల్లో టెలిమెడిసిన్‌తో కూడిన హాస్పిటల్స్, నియోజకవర్గ కేంద్రంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అలాగే సీసీ రోడ్లు, వంతెనల ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, రైతులకు సబ్సిడీ పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు పోలేరమ్మ ఆశీస్సులు ఉండాలి

● ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ ఆశీస్సులు పొందుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పటణంలోని 1వ వార్డు అడవిరాజుపాలెం, కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామాలలో మంగళవారం పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ల కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఇళ్ల నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయాల వద్దకు వచ్చి అక్కడ పొంగళ్లు పెటుకుని అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ రెండు గ్రామాల్లోని పోలేరమ్మ పొంగళ్ల కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రజలు కులమత, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పండుగ వాతావరణంలో పోలేరమ్మ పొంగళ్లు పెట్టుకోవడం ఆయా గ్రామాలకు శుభ పరిణామం అన్నారు. ఆయా గ్రామాల్లో కొందరి నేతల ఇళ్లకు వెళ్లి వారితో వేడుకలను పంచుకున్నారు.

కరేడు ఉద్యమం నుంచి తప్పుకుంటున్నా

● మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని రైతులు కలవడం ఉద్యమ ద్రోహం
● బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్

కందుకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కరేడు రైతుల ఉద్యమం నుంచి తప్పుకుంటున్నానని, రైతులు వెళ్లి వైసీపీ అధినేత జగన్‌ను కలవడం ఉద్యమ ద్రోహమని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఈ సమస్యకు మూల కారణం జగన్ కాగా కరేడు రైతుల తీరు దొంగచేతికి తాళాలు ఇచ్చినట్లుగా ఉందని ఆయన ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యంగా జరుగుతున్న ఉద్యమాన్ని రైతుల కోసం నా కష్టాన్ని కొందరు రైతులు నీరుగార్చారని అందుకే ఈ ఉద్యమం నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. కరేడు రైతులు వేలాదిగా వచ్చి జాతీయ రహదారిని దిగ్బంధించిన ఉద్యమంలో ఈయన ముందుండి నడిపించిన విషయం తెలిసిందే. హైకోర్టు న్యాయవాదుల బృందం కరేడులో పర్యటించి రైతులకు సంఘీభావం ప్రకటించటం, వారు రైతులకు సంపూర్ణంగా అండగా ఉంటామని న్యాయపోరాటం చేస్తామని ప్రకటించటంలో కూడా క్రియాశీలంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఉద్యమం నుంచి తప్పుకుంటున్నట్లు చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది.

ఘనంగా ఉద్యాన కళాశాల వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధ్యాపకులు, శాస్త్రవేత్తలు

కందుకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఓగూరు వద్ద నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యాన కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యాన కళాశాల అధ్యాపకులతో పాటు స్థానిక సీటీఆర్ఐ, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యానపంటల సాగులో నూతన పద్ధతులు, మిల్లెట్ల సాగు తదితర అంశాలపై తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన యూనివర్సిటీ విద్యార్థుల వ్యవహారాల అధికారిణి డాక్టరు యస్.సూర్యకుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించటమే గాక సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దటంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టరు ఎం.పవిత్ర, టి.పద్మలత, ఎం.శిరీష, సీటీఆర్ఐ హెడ్ ఎం. అనూరాధ, శాస్త్రవేత్త జి.హరిబాబు, కేవీకే హెడ్ జి.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ గద్దల రెక్కలు విరిసి సముద్రంలో వేస్తాం

● మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు



మహిళా రైతు కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ఉలవపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : పచ్చని గ్రామంపై కార్పొరేట్ గద్దల కళ్లు పడ్డాయని, వాటి రెక్కలు విరిచి బంగాళాతంలో పడేసే వరకు మహిళా రైతు కూలీల పోరుబాటలో భాగస్వాములమై పోరాడతామని మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు తెలిపారు. మంగళవారం మహిళా సంఘాల వైక్య వేదిక నాయకులు కరేడు గ్రామంలో పర్యటించి వేరుశనగ, ఆకుకూరలు, కూరగాయలు పండించే పొలాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా అరకొరగా ఉన్న భూముల్లో ఏడాదిపాటు వ్యవసాయం చేసుకుంటూ, ఇతరుల పొలాల్లో కూలి పనులకు వెళుతూ తద్వారా వచ్చే సంపాదనతో కుంటుబాన్ని నెట్టుకొస్తున్నామని కూలీలు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు పెడితే చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు ఇస్తారు సరే.. భూమిమీద ఆధారపడి, రోజువారి కూలీలుగా జీవనం సాగించే మాబోటోళ్ల పరిస్థితి ఏమిటన్నారు. అనంతరం ఆకుతోట సంఘం ఎస్టీ కాలనీలో పర్యటించి వారికి మాకు పంట భూములు లేవు, ఉన్నదల్లా ఈ కాలనీ మాత్రమేనని, ఇవికూడా తీసేసుకుంటారంటా.. బయటకు వెళ్లి బతికే శక్తి మాకులేదని ఎస్టీలు వాపోయారు. అనంతరం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ రమాదేవి మాట్లాడుతూ కరేడు గ్రామంలో జరుగుతున్న ఉద్యమానికి మద్దతుగా నిలిచేందుకు మహిళా సంఘాల ఐక్య వేదిక నాయకులు స్వయంగా పర్యటించి బాధితుల అభిప్రాయం తెలుసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి పేరుతో పచ్చని పంట పొలాలు జోలికి వెళ్లకుండా, జీవో 43 రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్ పద్మశ్రీ, సీపీఐ నేత అక్కినేని వనజ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాభవాని, ఐద్వా రాష్ట్ర సహాయక కార్యదర్శి రమణి, స్థానికుడు మోహన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు

● కమిషనర్ శ్రావణ్‌కుమార్



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, డీఈ తదితరులు

కావలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ డీఈతో కలిసి వైకుంఠపురం ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరా సరిగా జరగటం లేదని, బావులు, బోర్‌లలో నీరు అడుగంటి ఉందని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ వైకుంఠపురం ప్రాంతంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యటించి తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు.

542 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 611 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 542 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-47, ఆర్ఆర్-1, సీఆర్-20, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 69 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.197.53గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని వెలగపాడులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సీసీరోడ్లు, పక్కా గృహాల నిర్మాణం, పింఛన్ల మంజూరు వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, బూత్ ఇన్‌చార్జ్ గొల్లపూడి ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు దాతల చేయూత



దాతల దాతృత్వంతో కొనుగోలు చేసిన టోటల్ స్టేషన్ పరికరాన్ని చూపుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కావలి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు స్టోనెక్స్ ఆర్-1 ప్లస్ 300 టోటల్ స్టేషన్ పరికరాన్ని దాతల సహకారంతో కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కళాశాలలో ఆ పరికరాన్ని ప్రదర్శించి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఆధునిక సర్వే పరికరం ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. టోటల్ స్టేషన్ పరికరం వితరణకు తనతో పాటు దాతృత్వం అందించిన నంద్యాల ఈసీఈ రిటైర్డ్ సీనియర్ లెక్చరర్ జింక సుబ్బరాయుడు, నంద్యాల నుంచి కావలి బదిలీపై వచ్చిన హెడ్ ఆఫ్ సివిల్ ఇంజనిరింగ్ శ్రీనివాస రెడ్డి, మద్దూరుపాడుకు చెందిన శ్రీనివాస పైప్ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ రామ్మోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో టోటల్ స్టేషన్‌పై సర్వేయింగ్ సర్టిఫికెట్ కోర్స్ తమ కళాశాలలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇది విద్యార్థులకు, స్థానిక పరిశ్రమ వృత్తిపరులకు ఎంతగానో ఉపయోగం కానుందన్నారు.

విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉండాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

లింగసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు కలిగి ఉండాలని మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ చెప్పారు. ప్రపంచ యూత్ స్కిల్ డే సందర్భంగా మంగళవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మహమ్మద్ హఫ్తార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ ఎం పాండురంగయ్య, టి కిరణ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడప గడపకు వెళదాం : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు, ఏడాది పాలనలో ఎంత వరకు చేశారో.. ప్రజలను ఎంత మోసం చేస్తున్నారో గడప గడపకు వెళ్లి వివరించాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలులోని వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' పేరుతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, మండల ఉపాధ్యక్షురాలు ఎం.పద్మ, జడ్పీటీసీ కీర్తన, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు



వీధి లైట్లు వేస్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో వీధి లైట్లకు మంగళవారం స్థానిక సర్పంచు సాధు శ్రీలత మరమ్మతులు చేయించారు. 'వలేటివారిపాలెంలో అంధకారం' పట్టించుకోని పాలకులు, అధికారులు అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సర్పంచు స్పందించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మరమ్మతులకు గురైన వీధిలైట్లను బాగు చేయించారు. అవసరమైన చోట కొత్త ఎల్‌ఈడీ బల్బులు వేయిస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

వలేటివారిపాలెం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని చుండి, పోకూరు, వలేటివారిపాలెం, శింగమనేనిపల్లె తదితర గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఘట్టమనేని లక్ష్మీనరసింహం, గుర్రం లక్ష్మీనరసింహం, చెరువుపల్లి సాంబశివరావు, నాగభూషణం, కాకుమాను అంజనేయులు, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, వీరమోసు అంజయ్య, గౌడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ఆర్థికాభివృద్ధి

లింగసముద్రం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని మండలంలోని పెదపవని బూత్‌స్థాయి ఏజెంటు నర్సింశెట్టి వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం మండలంలోని పెదపవని, అన్నెబోయినపల్లి గ్రామాలలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. అర్హులకు పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



భళా.. భార్గవ్!

- ఏపీఎల్ కాకినాడ కింగ్స్ జట్టుకు ఎంపిక
- ఇండియా, ఐపీఎల్‌లో ఆడటమే లక్ష్యం : భార్గవ్ మహేష్

కావలి (టౌన్), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కాకినాడ కింగ్స్ జట్టుకు కావలి వాసి భార్గవ్ మహేష్ ఎంపికయ్యారు. పట్టణంలోని పాతూరుకు చెందిన సమాధి వెంకట కృష్ణమూర్తి, ఉమ దంపతుల కుమారుడు భార్గవ్ చిన్నతనం నుంచి క్రికెట్‌పై మక్కువతో పాఠశాల స్థాయి నుంచి ఆడుతూ ప్రతిభ కనపరుస్తున్నారు. భార్గవ్‌లోని ప్రతిభను గమనించిన కోచ్ రాజశేఖర్ శిక్షణ అందించారు. మినీ స్టేడియం (డీఎస్‌ఏ) మైదానంలోని కావలి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెట్స్‌లో సాధన చేస్తూ కోచ్ వద్ద మరిన్ని మెలకువలు నేర్చుకుని ఆల్ రౌండర్‌గా ఎదిగారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు నుంచి ప్రాతి నిధ్యం వహించి ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచి పలువురి ప్రశంసలు అందుకున్నారు. విశాఖలో ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (క్రికెట్)లో ఆడేందుకు నిర్వహించిన వేలంలో రూ.90వేలకు భార్గవ్‌ను ఎంపిక చేశారు. దీంతో పట్టణ, జిల్లా క్రికెట్ ప్రముఖులు క్రీడాభిమానుల ఆయనకు అభినందనలు తెలిపారు.

మరింత ముందుకు సాగుతా : భార్గవ్ మహేష్

తనలోని ప్రతిభను గుర్తించిన కోచ్ రాజశేఖర్ శిక్షణ అందించడం కావలి క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిద్ధు, తన తండ్రి అందించిన ప్రోత్సాహం, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో తాను రాణించగలిగాను. ఏపీఎల్‌కు కాకినాడ కింగ్స్‌కు ఎంపికవడం సంతోషంగా ఉంది. మరింత రాటుదేలేందుకు ప్రతిభ చాటుకునేందుకు ఏపీఎల్‌ను వేదికగా మలుచుకుంటాను. ఇండియాకు ప్రాతినిధ్యం వహించడం, ఐపీఎల్‌కు ఆడడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాను.

మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా!?

- విద్యార్థినులను ఆరా తీసిన కలెక్టర్ ఆనంద్
- గురుకులం, కుట్టు శిక్షణ, ఉపాధి హామీ పనుల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

అల్లూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : భోజనంలో మెనూ పాటిస్తున్నారా? అని విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన అల్లూరుకు చేరుకుని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, నీటి వసతి, వారు ఉండేందుకు తగిన వసతులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలికలతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భగా స్థానిక టీడీపీ నాయకుడు బీద గిరిధర్ కలెక్టర్‌ను కలిసి బాలికల గురుకుల పాఠశాల శాశ్వత భవనాలకు కేటాయించిన స్థలానికి సంబంధించిన నివేదికను అందజేసి పూర్తి వివరాలు తెలియజేశారు. అల్లూరులో సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్ ముందుగా గాలిదిబ్బలు ప్రాంతంలో కూలీలు చేస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వారికి 120 రోజుల పనిదినాలను కల్పిస్తున్నారా లేదా అని కూలీలను ప్రశ్నించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

ఐవీఆర్ఎస్ కాల్స్‌లో సోమలరేగడకు ద్వితీయ స్థానం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేసే ఐవీఆర్‌ఎస్ కాల్స్‌లో దుత్తలూరు మండలం సోమలరేగడ పంచాయతీ జిల్లాలో ద్వితీయస్థానం సాధించినట్లు కావలి డీఎల్‌పీవో పీ.వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమగలరేగడ పంచాయతీలోని ప్రజలకు ప్రభుత్వ నుంచి వచ్చిన ఐవీఆర్‌ఎస్ కాల్స్‌లో పారిశుధ్య కార్మికులు మీ ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా 92 శాతం, వారానికి కనీసం రెండుసార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా 91 శాతం సమాధానం ఇవ్వడంతో జిల్లాలో ద్వితీయ స్థానం నిలిచిందన్నారు. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఒక పంచాయతీకి సంబంధించిన ఇంటి పన్నులు, యజమానుల వివరాల పక్క పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి పొరపాట్లు ఉంటే సరి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సోమగలరేగడ పంచాయతీ కార్యదర్శిని ఎం.నాగ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ ఎంపీ డీవో మల్లికార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరులోని ప్రధాన బస్టాండులో ఉన్న ప్రాంతీయ కార్యాలయ ప్రాంగణంలో ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న అనేక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్, రవికాంత్ పాల్గొన్నారు.

పాఠశాలకు అయ్యోరు డుమ్మా!

- 2 రోజులుగా రాకపోవడంతో తెరుచుకోని తలుపులు



పాఠశాల తలుపులకు వేసిన తాళం

కావలి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే పాఠశాలకు డుమ్మా కొట్టాడు. కావలి మండలం ఆముదాలదిన్నె పంచాయతీ లింగంగుంట లో బడికి తాళం వేసి రెండు రోజులుగా పత్తా లేకుండా పోయాడు. తల్లిదండ్రుల వివరాల మేరకు లింగంగుంట ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా, ఏకోపాధ్యాయుడిగా కృష్ణ నాలుగేళ్లుగా పని చేస్తున్నాడు. రెండవ శని, ఆదివారాలు సెలవు రావటం తో ఇళ్లకే పరిమితమైన విద్యార్థుల సోమవారం బడికి వెళ్లారు. కానీ తలుపులు తీయకపోవడంతో వెనుతిరిగి వచ్చేశారు. మంగళవారం కూడా ఇదే పరిస్థితి. దీంతో పిల్లలు తల్లిదండ్రులకు చెప్పటంతో వారు వచ్చి చూడగా పాఠశాలకు తాళం వేసి ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తూ మీడియా దృష్టికి తెచ్చారు.

ఎలాంటి సమాచారం లేదు

సోమ, మంగళవారాలు ఆ టీచరు సెలవు పెడుతున్నట్లు మాకు సమాచారం లేదు. ఈ పాఠశాల ముసునూరు క్లస్టర్ పరిధిలో ఉందని సెలవు విషయం క్లస్టర్‌లో పనిచేసే హెచ్‌ఎంకు కూడా చెప్పకపోవటం, ఫోన్‌కు అందుబాటులో లేకపోవడంపై డీఈవో దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. గతంలో కూడా ఆయనపై అనేక ఆరోపణల రాగా, షోకాజు నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

- గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, ఎంఈవోలు

ఆటో బోల్తా పడి ఒకరి మృతి

రాపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబర్తి గ్రామ సమీ పాన ఎన్‌హెచ్-565పై మంగళవారం అతివేగంగా ప్రయాణిస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడగా, ఒక వ్యక్తి అక్కడిక క్కడే మృతి చెందాడు. పోలీ సుల కథనం మేరకు వివరాలు... రాపూరు మండలం గోనుపల్లి నుంచి ఏడుగురు వ్యక్తులతో ప్రయాణిస్తున్న ఆటో పెనుబర్తి దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోనుపల్లికి చెందిన పీ.మస్తాన్ (47) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడితోపాటు అతడి చిన్నకొడుకు అదే ఆటోలో ఉండగా, అతనికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ పెంచలయ్య పరారయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులను 108 సహాయంతో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పంచనామా కోసం రాపూరు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బీఈడీ కళాశాలకు ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన

నెల్లూరు (విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నిర్వహిం చిన బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ విద్యా ర్థినులు సీహెచ్ మహిమ 8.6 శాతంతో ప్రథమ స్థానం, షేక్ తమ్‌సిన్ 8.5 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచారని చెప్పారు. మున్ముందు మరిన్ని మంచి ఫలితాలు సాధించేలా విద్యాబో ధన అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రావెల్ దందాకు అడ్డుకట్ట పడేనా..?

యథేచ్ఛగా అక్రమ రవాణా
చోద్యం చూస్తున్న అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

ఉదయగిరి రూరల్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ ప్రాంత భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రావెల్‌ను ట్రాక్టర్లలో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నా అధికారులు మౌనం వహిస్తు న్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లేఅవుట్లు, బొగ్గు, ఇటుక బట్టీలు, ఇతర వాణిజ్య అవసరాలకు మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకోవడం సవాలక్ష నిబంధనలతో కూడుకున్నపని. ఈ నిబంధనలను తుంగలో తొక్కిన వ్యాపారులు అక్రమ వ్యాపారానికి తెరలేపారు. రాత్రీపగలు తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు సాగిస్తూ గ్రావెల్‌ను సరిహద్దులు దాటించి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, కావలి నియోజక వర్గాల్లో విస్తారమైన చెరువులు, ప్రభుత్వ, అటవీ భూములు అధికంగా ఉన్నాయి. దీంతో అక్రమార్కులు చెరువులతోపాటు కొండలను సైతం కొల్లగొడుతూ గుల్ల చేస్తున్నారు.

నిరంతరం తరలింపు

రోజూ లెక్కకు మించిన ట్రాక్టర్లతో గ్రావెల్ ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల అనుచరులకు నగదు ముట్టజెప్పి సాగిస్తున్న దందాపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన సమయంలోనే అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తరువాత పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో స్థానికులే స్వచ్ఛందంగా అక్రమ వ్యాపారులను అడ్డుకుంటుండడం గమనార్హం.

అనుమతులు అంతంతే..

నియోజకవర్గంలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు. కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోని గ్రామాల్లో గోరంత అనుమతులు పొంది, కొండంత వ్యాపారం సాగిస్తున్నారు. అధికార పార్టీ అండతో అడ్డంకులు లేకుండా గ్రావెల్ వ్యాపారం సాగిస్తూ చెరువులు, వాగులు, వంకలు, ప్రభుత్వ భూములను సైతం నామరూపాలు లేకుండా చేస్తున్నారు. దీంతో ఇష్టానుసారంగా తీసిన గుంతలు వర్షాల సమయంలో ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, గ్రావెల్ అక్రమ దందాను అడ్డుకోవాల్సి ఉంది.



గ్రావెల్ తవ్వకాలతో తూర్పుబోయమడగలలో ప్రమాదకరంగా మారిన గుంతలు

రాజేష్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

- మొగిలిచెర్లలో పోలీస్ పికెట్

లింగసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్లలో గోరంట్ల రాజేష్‌పై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసిన చుండూరు పోతులూరయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం నారాయణ మంగళవారం తెలిపారు. ఈ దాడిలో గాయపడిన రాజేష్ కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరడంతో అక్కడి పోలీసులు బాధితుడు రాజేష్ స్టేమెంటును నమోదు చేసుకొని పంపించగా, ఆ మేరకు పోతులూరయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా మొగిలిచెర్లలో ఎలాంటి గొడవలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలో సోమవారం రాత్రి నుంచే పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పికెట్ మంగళవారం కూడా కొనసాగింది.

జేవీవీ రాష్ట్ర కమిటీలో జిల్లా బాధ్యులు



శ్రీనివాసులు రెడ్డి

ఉదయగిరి రూరల్, జూలై 15 (ఆంధ్ర జ్యోతి): జనవి జ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీలో జిల్లా బాధ్యులకు సముచితం స్థానం లభించింది. జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పని చేసినవారిని గుర్తించి, ఈనెల 13న కడప లో జరిగిన రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లాకు చెందిన కుమ్మిత శ్రీనివాసు లురెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపి కయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా జీ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బీ విశ్వ నాథ్, ఉపాధ్యక్షుడిగా వీ చక్రపాణి, కార్యదర్శిగా ఏవీ గీతాంజలి, సలహా మండలి, న్యాయశాఖ, ఆరోగ్య సబ్ కమిటీ సభ్యులుగా కేవీ శేషారెడ్డి, ఎం శివ పార్వతి, వీ వేణుగో పాల్, సభ్యులుగా పీ బాలకోటేశ్వరరావు, షేక్ గౌస్‌బాషాలను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారిని జిల్లా, మండలాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో జేడీ విచారణ

నెల్లూరు (వైద్యం) జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో గత ఇన్‌చార్జ్ ఏవో, జూనియర్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డారంటూ గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నాగార్జునరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి మంగళవారం విజయవాడ నుంచి నెల్లూరుకు చేరుకుని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. మాజీ ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లుతోపాటు జూనియర్ అసిస్టెంట్ సందీప్ విచారణలో పాల్గొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో జరిగిన ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాల్లో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని మాజీ ఏవో వెంకటేశ్వర్లును విచారణ అధికారి మల్లేశ్వరి ప్రశ్నించగా అవన్నీ నిరాధారమైనవని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో నియమితులైన 9 మంది ఫార్మసీ, ఎల్టీలని ప్రశ్నించగా తాము ఎవరికీ ముడుపులు ఇవ్వలేదని రాత పూర్వకంగా తెలిపినట్లు తెలిసింది. అయితే కావాలనే అధికారులు వారిని భయపెట్టి తమకు అనుకూలంగా రాయించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మరో కేసుకు సంబంధించి గతంలో డీఎంహెచ్‌వో సీసీగా పనిచేసిన సందీప్ అనే వ్యక్తి తిరుపతికి బదిలీ అయినా నెల్లూరు వైద్య ఆరోగ్యశాఖలో ఎలా పనిచేస్తున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. కాగా, విచారణ అంతా ఏకపక్షంగా జరిగిందని, మరోసారి విచారణ జరపాలంటూ ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ విచారణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లా స్టోర్స్‌లో సిద్ధంగా ఉన్నాయని, వెంటనే వాటిని డ్రా చేసి వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు లోని ఆయన కార్యాలయం నుంచి మంగళవారం జిల్లాలోని విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న వారి ఎస్టిమేషన్స్ వెంటనే సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించాలని, ప్రతీ ఫీడర్ పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌తో సంస్థపై పెనుభారం పడుతుందని, వీలైనంతవరకు దీనిని తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర వాట్సాప్ 95523 00009 నెంబరు ద్వారా విద్యుత్ సేవలను ప్రజలు పొందవచ్చన్నారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలని, సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమాశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పీ మురళి తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కళాధర్‌రావును అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కళాధర్‌రావు

కావలి/నెల్లూరు (సాంస్కృతికం) : అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడిగా కావలికి చెందిన విశ్రాంత ఎంపీడీవో రేవూరు వెంకట కళాధరరావు ఎంపికయ్యారు. ఆ మహాసంఘం ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్ర కమిటీ శ్రీగురు పురస్కారాలు, విద్యా వత్ సభలు, పంచాంగకర్తల సదస్సులు ఈనెల 13, 14, 15 తేదీలలో నరసరావుపేటలో జరి గాయి. చివరి రోజైన మంగళవారం జిల్లా కమిటీల నియామకం జరిగింది. నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడితోపాటు గౌరవాధ్యక్షుడిగా వై.శేషగిరిరావు, కార్యదర్శిగా మామిడిపల్లి చంద్రశేఖర్‌రావు, కోశాధికారిగా భట్టారం రామవేంద్ర, ఉపాధ్యక్షులుగా మాధవాచార్యులు, అర్చక పురోహిత విభాగం గౌరవ సలహాదారులుగా ఎం.నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కళాధరరావు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేస్తూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులకు విద్య, వైద్య రంగాల్లో చేయూతనిచ్చి వారి అభివృద్ధికి తోడ్పడతామన్నారు. అర్చక, పురోహితుల సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తిరుపతి, కడప జిల్లాల పరిశీలకుడిగా సురేంద్రబాబు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15(ఆంధ్రజ్యోతి) : ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ తిరుపతి, కడప జిల్లాల నూతన కమిటీల ఎన్నికల పరిశీలకుడిగా నెల్లూరుకు చెందిన ఊరందూరు సురేంద్రబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ ఏజే శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

- మాజీ ఎమ్మెల్సీ విఠపు
- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



ధర్నా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాల సుబ్రహ్మణ్యం ఉద్ఘాటించారు. ఆల్‌ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ సవరణ బిల్లు పెన్షనర్ల పాలిట గొడ్డలిపెట్టు వంటిదని, తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లతో వినతిపత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఉపాధ్యాయ ఉద్యమనేత పీ బాబురెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయా లని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే ఖాసిం. కోశాధికారి హజరత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.